APTEL/25/A2082

# పతాకం న్యూస్

PATHAKAM NEWS TELEGU DAILY — తెలుగు దినపత్రిక

సంపుటి : 01 | సంచిక : 186 | విశాఖపట్నం | 7-4-2026 మంగళవారం | చీఫ్ ఎడిటర్ : ఎల్. కృష్ణరావు | పేజీలు: 8 | వెల: రూ.5/-

Volume : 01 | Issue : 186 | VISAKHAPATNAM | 7-4-2026 TUESDAY | CHIEF EDITOR: L.KRISHNA RAO | Pages:8 | Rate: Rs.5/-

Visakhapatnam, Srikakulam, Allurisitarama, Rajamahendravaram, Vijayawada, Tirupati, Anathapuram



SBI
PATHAKAM NEWS
SCAN & PAY
UPI ID: 44576280686@sbi
BHIM | UPI
yono SBI | BHIM SBI Pay
G Pay | Paytm | Pay




2లో

అసోంలో చొరబాటుదారులకు

## కాంగ్రెస్ మద్దతు: మోడీ

## బరువు తగ్గాలనుకుంటున్నారా?



6లో



2లో

## రాష్ట్రపతి భవన్‌కు చేరిన.. అమరావతి చటబద్ధత బిల్లు

భూగర్భ జలాలు పెంచాం.. ప్రతీ ఎకరాకు నీరిచ్చే

# బాధ్యత: చంద్రబాబు



**అనంతపురం, పతాకం న్యూస్:** బ్యాంకుల్లో డబ్బు దాచినట్లే భూగర్భాన్ని జల బ్యాంకుగా మారుద్దామని ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపునిచ్చారు. అలా చేస్తే ఏపీలో కరవే ఉండదన్నారు. చెరువులు, సాగునీటి కాలువల్ని ఆక్రమించిన వారు స్వచ్ఛందంగా వదులుకోవాలని స్పష్టం చేశారు. లేదంటే అధికారులు కఠినంగా వ్యవహరించాలని ఆదేశించారు. 2027 గోదావరి పుష్కరాల నాటికి పోలవరం పూర్తి చేస్తామని పునరుద్ఘాటించారు."నీటి భద్రత–సాగునీటి సంఘాల బాధ్యత" అంటూ అనంతపురం జిల్లా యాడికిలో నిర్వహించిన కార్యక్రమంలో సీఎం చంద్రబాబు పాల్గొన్నారు. తొలుత భూగర్భ జలాల పెంపు విధానాలపై ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలించారు. ఉత్తమ విధానాల గురించి కలెక్టర్, ఎమ్మెల్యేలు సీఎంకు వివరించారు. ప్రతీ ఎకరాకు నీరిచ్చే బాధ్యత ప్రభుత్వానిదని చెప్పిన సీఎం దాన్ని సద్వినియోగం చేసుకునే బాధ్యత ప్రజలదని స్పష్టం చేశారు. రాయలసీమను ప్రపంచానికే హార్టికల్చర్ హబ్‌గా తయారు చేస్తున్నట్లు ప్రకటించారు. అనంతపురంలో జిల్లాలో భూగర్భ జలాలను 11.25 మీటర్లకు తీసుకొచ్చామని సీఎం చంద్రబాబు తెలిపారు. నీటిఎద్దటి లేకుండా చేసేందుకు అండగా ఉంటామన్నారు. రాయలసీమలో సాగునీటి కోసం కొట్లాటలు ఉండేవని గుర్తు చేశారు. అన్నమయ్య జిల్లాలో (తరువాయి 2వ పేజీలో)

చల్లపల్లి ఘటనలో గాయపడ్డ పోలీసులను

# పరామర్శించిన అనిత



**కృష్ణా జిల్లా, పతాకం న్యూస్:** కృష్ణా జిల్లా చల్లపల్లి పోలీస్‌స్టేషన్‌లో పేలుడు ఘటనలో గాయపడ్డ పోలీసులను హోంమంత్రి అనిత పరామర్శించారు. మంగళగిరి ఎన్ఆర్ఐ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న పోలీసులకు ధైర్యం చెప్పారు హోం మంత్రి. పోలీసుల కుటుంబ సభ్యులతో మాట్లాడి, ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. పోలీసులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులకు హోంమంత్రి అనిత ఆదేశాలు ఇచ్చారు. ఈ సందర్భంగా హోం మంత్రి అనిత మాట్లాడుతూ.. కృష్ణా జిల్లా చల్లపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో అనుమతులు లేకుండా క్రాకర్స్ కార్యకలాపాలు నిర్వహిస్తున్న దుకాణాల నుంచి సీజ్ చేసిన టపాసులను కోర్టుకు తరలిస్తుండగా పేలుడు జరిగిందన్నారు. ఈ ఘటనలో ఎస్సై, కోర్ట్ కానిస్టేబుల్, ఇద్దరు కానిస్టేబుళ్లకు గాయాలయ్యాయన్నారు. అబ్దుల్లా అనే కానిస్టేబుల్ 50 – 60 శాతం గాయాలతో ఉన్నారని.. మిగతా వాళ్లకి కూడా ఎటువంటి ప్రాణాపాయం లేదని తెలిపారు. గాయపడిన పోలీసుల ఆరోగ్య పరిస్థితులను కృష్ణా జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారని చెప్పారు. గాయపడిన వారు అందరూ త్వరగా కోలుకోవాలని కోరుకుంటున్నట్లు హోంమంత్రి తెలిపారు. వారి కుటుంబ సభ్యులను ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుందని స్పష్టం చేశారు. ఎంతో ప్రత్యేక శ్రద్ధతో వైద్యం అందిస్తున్న ఎన్ఆర్ఐ హాస్పిటల్ బృందానికి హోం మంత్రి అనిత ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.


గత పాలకుల వల్లే

## ఏపీకి ఈ పరిస్థితి: గొట్టిపాటి



**పిడుగురాళ్ల, పతాకం న్యూస్:** పిడుగురాళ్ల మెడికల్ కాలేజీతోపాటు ఆసుపత్రి సేవలు ఈ ఏడాది ప్రారంభిస్తామని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ వెల్లడించారు. ఈ మెడికల్ కాలేజీ, బోధన ఆసుపత్రి నిర్మాణం నిర్ణీత వ్యవధిలో పూర్తి చేయాలని ఉన్నతాధికారులను ఈ సందర్భంగా మంత్రి గొట్టిపాటి ఆదేశించారు. సోమవారం పల్నాడు జిల్లాలోని పిడుగురాళ్లలో మంత్రి గొట్టిపాటి రవి కుమార్ పర్యటించారు. ఈ సందర్భంగా మెడికల్ కాలేజీతోపాటు ఆసుపత్రి నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. అనంతరం మంత్రి గొట్టిపాటి రవికుమార్ మాట్లాడుతూ.. రాష్ట్రం విడిపోయి పదమూడేళ్లు అయినా.. రాజధాని లేదని దేశమంతా నవ్వుతున్నారని అన్నారు. గత పాలకుల వల్లే మన రాష్ట్రానికి ఈ పరిస్థితి వచ్చిందని విమర్శించారు. గత ఐదేళ్ల కాలంలో మూడు ప్రాంతాల పేర్లు చెప్పారని.. ప్రస్తుతం మూడు ఊర్ల పేర్లు చెబుతున్నారంటూ వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌తోపాటు ఆ పార్టీ నేతలపై పరోక్షంగా విమర్శలు గుప్పించారు.

## కోస్తా జిల్లాల్లో ఈదురు గాలులతో కూడిన వర్షాలు



**విశాఖపట్నం, పతాకం న్యూస్:** కోస్తా జిల్లాల్లో వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ సోమవారం వెల్లడించింది. పలుచోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురుస్తాయని వివరించింది. ఒడిశా, దక్షిణ కోస్తా ప్రాంతాల్లోని ఉపరితల ఆవర్తనం ఏర్పడిందని విశాఖపట్నంలోని వాతావరణ శాఖ వివరించింది. ఈ నేపథ్యంలో రాగల 24 గంటల్లో శ్రీకాకుళం, పార్వతీపురం, అనకాపల్లి, కాకినాడ, యానాం, కోనసీమ, అల్లూరి సీతా రామరాజు మన్యం, తూర్పు గోదావరితోపాటు ఏలూరు జిల్లాల్లో వర్షాలు కురుస్తాయని తెలిపింది. మిగిలిన జిల్లాల్లో ఒక మోస్తరు వర్షాలు పడతాయని స్పష్టం చేసింది. దీంతో కోస్తా తీరం వెంబడి గంటకు 45 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని వాతావరణ శాఖ వెల్లడించింది. మరోవైపు రాష్ట్రంలోని పలు జిల్లాలో సోమవారం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ వెల్లడించారు. ఈ నేపథ్యంలో పిడుగులు పడే అవకాశం ఉందని అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు స్పష్టం చేశారు. గాలుల తీవ్రత దృష్ట్యా పాత భవనాలు, విద్యుత్ స్తంభాలు, చెట్ల కింద, భారీ హోర్డింగ్స్ వద్ద నిలబడ వద్దని హెచ్చరించారు.


APTEL/25/A2082
పతాకం న్యూస్
PATHAKAM NEWS TELEGU DAILY — తెలుగు దినపత్రిక
ధర్మం కోసం పోరాటం చేస్తున్నా..
అవినీతి, అక్రమాలను బయటకు తీస్తున్నా..
పతాకం న్యూస్‌కు సహకరించగలరు
సంవత్సరం చందా రూ. 2000
PATHAKAM NEWS
State Bank of India
A/c No: 44576280686
IFSC:SBIN00021297
DUVVADA BRANCH




## 'మావిగన్'పై ప్రజల్లో జరుగుతున్న చర్చను చూసి ప్రభుత్వానికి భయం పట్టుకుంది: కాకాణి

4లో



## మూలపేట పోర్టు నిర్వాసితుల కాలనీల్లో మంత్రి అచ్చెన్నాయుడు పర్యటన

2లో

పతాకం న్యూస్
APTEL/25/A2082
PATHAKAM NEWS TELEGU DAILY
తెలుగు దినపత్రిక

# సంపాదకీయం

## విలాపం!

యుద్ధం అనే రెండక్షరాలు.. ప్రపంచానికి పెను ప్రమాదంగా మారాయి. మానవ చరిత్రలో యుద్ధాలు ఎప్పుడూ విజయం కాదు... వినాశనానికి మరో పేరు. మహాభారత యుద్ధానికి ముందు పాండవుల తరఫున శ్రీకృష్ణుడు దూతగా కౌరవుల వద్దకు రాయబారానికి వెళ్లిన సందర్భంలో- 'నీ పిల్లలు పాపలున్ ప్రజలు పెంపు వహింపగ పొందు సేసెదో/ యెల్లి రణంబు కూర్చెదవొ యేర్పడ చెప్పుము కౌరవేశ్వరా' అంటాడు. అంటే... నీ పిల్లలు, పాపలు, ప్రజలు వృద్ధి చేసెడి శాంతి కావాలా, నాశనాన్ని తెచ్చే యుద్ధం కావాలా? తేల్చుకో అని అర్థం. కానీ, దుర్యోధనుడి బుద్ధి యుద్ధానికి మొగ్గు చూపింది. ఆ యుద్ధం ముగిసే నాటికి కురువంశమే సర్వనాశనమైనట్లు మహాభారతం ద్వారా తెలుస్తుంది. నాటి నుంచి నేటి వరకు... ఇలాంటి హితవులు చాలామంది మేధావులు చెప్తూనే వున్నారు. మొదటి ప్రపంచ యుద్ధం నాటి బెర్ట్రాండ్ రస్సెల్ నుంచి నేటి పరిశోధకుల వరకు అందరిదీ ఒకే మాట. 'యుద్ధం వల్ల ఎవరూ గెలవరు, కేవలం విధ్వంసం మాత్రమే మిగులుతుంది' అని. 'మూడో ప్రపంచ యుద్ధం ఏ ఆయుధాలతో జరుగుతుందో నాకు తెలియదు కానీ, నాలుగో ప్రపంచ యుద్ధం మాత్రం రాళ్లు, రప్పలతో జరుగుతుంది' అన్న అల్బర్ట్ ఐన్‌స్టీన్ హెచ్చరించాడు. 'ఇరాన్‌ను రాతియుగంలోకి నెట్టేస్తాం' అన్న ట్రంప్ హూంకరింపు ఆ దిశగా అడుగులు వేస్తున్నట్టే కనిపిస్తోంది. ప్రతి యుద్ధం మనిషి అహంకారానికి చిహ్నం కాగా, మానవత్వానికి గాయంగా మిగిలింది. 'ఏ యుద్ధమైనా ఆధిపత్యం కోసం చేసే పోరే/ ఏ వ్యూహమైనా దొంగదెబ్బ తీయటానికే/ ప్రపంచశాంతి ప్రతిజ్ఞల్ని వల్లెవేయిస్తూనే అది/ మెల్ల మెల్లగా దేశాల్ని తన చెప్పుకిందకి తోసేస్తూ/ స్వలాభంకోసం నిప్పుల్ని సైతం మింగుతుంది/ చేతులు శూన్యమే అనిచూపుతూ/ వీపువెనక అణ్వాయుధాలు దాచుకుంటుంది' అంటారు కవయిత్రి శీలా సుభద్రాదేవి. ఈ నేపథ్యంలో- మానవ మేధస్సు సృష్టించిన విజ్ఞానం ప్రాణాలు కాపాడటానికే తప్ప, సమాధులు కట్టడానికి కాదని ప్రపంచ శాస్త్రవేత్తలు గొంతెత్తుతున్నారు. మానవీయ విలువల్ని దృష్టిలో పెట్టుకుని పశ్చిమాసియాలో జరుగుతున్న యుద్ధోన్మాదాన్ని తక్షణం ఆపాలని ప్రపంచ శాస్త్రవేత్తలు పలువురు తమ సంతకాలతో కూడిన వినతిపత్రాన్ని ఐరాస ప్రధాన కార్యదర్శికి పంపారు. వీరిలో నోబెల్ బహుమతి గ్రహీతలు, భారతీయ శాస్త్రవేత్తలు కూడా వున్నారు. 'నోబెల్ శాంతి బహుమతి కోసం అంగలార్చినవాడు ఒక 'వార్ క్రిమినల్'గా మిగిలిపోవడం ఏమైనా బావుందా? అమెరికా పౌరులు, ఆ దేశ ఉపాధ్యక్షుడు సైతం యుద్ధం ఒక తప్పుడు నిర్ణయమని చెప్పున్నారు కదా? తక్షణం యుద్ధం ఆపి, నిరాశ్రయులైన వారిని ఆదుకోవాలి. నిరాశ్రయుల సమస్య ఒక అంతర్జాతీయ సమస్య. కనుక అన్ని దేశాలు కలిసికట్టుగా నిరాశ్రయుల్ని ఆదుకోవాలని చైనా కూడా పిలుపునిచ్చింది కదా? నిరాశ్రయుల్లో పసిబిడ్డలు వేల సంఖ్యలో వున్నారు. ఈ యుద్ధాలతో, రాజకీయాలతో ఏమాత్రం సంబంధం లేనివారు కదా ఆ బిడ్డలు. అనేక మంది శాస్త్రవేత్తలు కూడా యుద్ధం వల్ల చాలా నష్టపోయారు. విద్యాలయాలు, వైద్యాలయాలు ధ్వంసమయ్యాయి...' కనుక యుద్ధాన్ని తక్షణం నిలిపేసి, వారిని ఆదుకోవాలి. పేదలను, బాలలను బాధపెట్టి, ఆర్థిక నాశనాన్ని కొనితెచ్చే యుద్ధాలు సమస్యలకు పరిష్కారం కాదు' అని మేధావులు హితవు చెప్తున్నారు. పురాణేతిహాసాలైనా, చరిత్ర పుస్తకాలైనా ప్రతి పుటనీ దులిపి తెరచి చూడు. ప్రతి పేజీలోనూ కుటిల రాజనీతితో మేటవేసిన బూడిద కుప్పల కింద దాచేస్తే దాగని చారిత్రక సత్యాలు అనేకం కనిపిస్తాయి. రష్యా- ఉక్రెయిన్ యుద్ధమైనా, వెనెజులా అధ్యక్షుడ్ని అర్ధరాత్రి పడకగదిలోకి చొరబడి బంధించడమైనా, ఇప్పుడు ఇరాన్‌పై విరుచుకుపడుతున్న అమెరికా, ఇజ్రాయెల్ నీతి నియమాలకు నీళ్లొదిలి నెత్తుటేళు పారించడమైనా అనేక రాజకీయ, ఆర్థిక ప్రయోజనాలతో ముడిపడినవే. పాఠశాలలు, ఆసుపత్రులు ధ్వంసం కాగా, క్షతగాత్రులుగా మారుతున్న చిన్నారుల శోకం.. కరుణశ్రీ 'పుష్పవిలాపం' కావ్యాన్ని గుర్తు చేస్తున్నాయి. అక్కడ పుష్పాలు, ఇక్కడ చిన్నారులు అంతే తేడా. యుద్ధాలు, రాజకీయ గందరగోళం, సంపన్నులకు అనుకూలమైన ఆర్థిక విధానాలు, వంటి ప్రతికూల పరిస్థితుల మధ్య యువత భవిత ప్రశ్నార్థకంగా మారుతోంది. మేధావులు, శాస్త్రవేత్తల హెచ్చరికలను పెడచెవిన పెడితే భవిష్యత్ తరాలకు మనం మిగిల్చేది బూడిద కుప్పలే.

## పుదుచ్చేరికి రాష్ట్ర హోదా: రాహుల్‌గాంధీ



**పుదుచ్చేరి:** అసెంబ్లీ ఎన్నికల్లో తమ పార్టీ అధికారంలోకి వస్తే పుదుచ్చేరి కి రాష్ట్ర హోదా కల్పిస్తుందని కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ హామీ ఇచ్చారు. పుదుచ్చేరిలోని ప్రాంతీయ నాయకులను బీజేపీ పక్కనపెట్టి రిమోట్ కంట్రోల్ ద్వారా పాలన సాగిస్తోందని విమర్శించారు. తమ పార్టీ అధికారంలోకి వస్తే 6 నెలల్లోగా స్థానిక సంస్థలకు ఎన్నికలు జరిపిస్తామని భరోసా ఇచ్చారు. లాస్‌పేట్‌లో సోమవారంనాడు జరిగిన ఎన్నికల ప్రచార ర్యాలీలో రాహుల్ పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే పుదుచ్చేరిలోని నిరుద్యోగ యువతకు ప్రతినెలా రూ.2,000 చొప్పున ఆర్థిక సాయం అందిస్తుందని చెప్పారు. ప్రభుత్వ, ప్రైవేటు రంగంలో కొత్తగా 30,000 ఉద్యోగాల కల్పన, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పిస్తామని రాహుల్ హామీ ఇచ్చారు. ప్రభుత్వ ఉద్యోగాలకు వయోపరిమితిని 40 ఏళ్ల వరకూ సడలిస్తామని వాగ్దానం చేశారు. ప్రతి కుటుంబానికి రూ.20 లక్షల ఆరోగ్య బీమా సౌకర్యం కల్పిస్తామని ప్రకటించారు. పుదుచ్చేరిలో పారిశ్రామిక, వస్త్ర పరిశ్రమలు తగ్గిపోయాయని, 100 వరకూ ఫ్యాక్టరీలు మూతపడ్డాయని చెప్పారు. పాండిచ్చేరిలో నకిలీ డ్రగ్స్ తయారీ రాకెట్ నడుస్తోందని, నకిలీ మందులు తయారవుతున్నాయనీ, అయినప్పటికీ ఎలాంటి చర్యలు లేవని తప్పుపట్టారు. అన్ని కాంటాక్టుల్లోనూ ప్రభుత్వం 30 శాతం కమిషన్ తీసుకుంటున్న వ్యవహారం అందరికీ తెలిసిందేనని, ప్రభుత్వం కలెక్షన్ ఏజెంట్‌గా మారిందని రాహుల్ విమర్శించారు. ప్రతి టోల్‌గేట్ వద్ద బలవంతంగా ప్రజల నుంచి సొమ్ములు వసూళ్లు చేస్తున్నారని, ప్రజల నుంచే కాకుండా దేవుళ్లు, దేవాలయ భూములను కూడా ప్రభుత్వం ఆక్రమించుకుంటోందని ఆరోపించారు. కాగా, 30 మంది సభ్యుల పుదుచ్చేరి అసెంబ్లీకి ఏప్రిల్ 9న పోలింగ్ జరుగనుండగా, మే 4న ఫలితాలు వెలువడతాయి.

## మూలపేట పోర్టు నిర్వాసితుల కాలనీల్లో మంత్రి అచ్చెన్నాయుడు పర్యటన



**సంతబొమ్మాళి, పతాకం న్యూస్:** మూలపేట పోర్టు నిర్వాసితుల ఆర్అండ్ఆర్ కాలనీలను రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తో కలిసి సోమవారం సందర్శించారు. కాలనీల్లో తాగునీటి సమస్యలను పరిశీలించిన ఆయన, 90 రోజుల్లో తాగునీటి సౌకర్యం పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. నీటి భద్రత, సాగు నీటి సంఘాల బాధ్యతపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందని మంత్రి తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేపట్టిన నీటి సంరక్షణ కార్యక్రమంపై అధికారులు శ్రద్ధ చూపాలని సూచించారు. వర్షపు నీటిని నిల్వ చేసి భూగర్భ జలాలను పెంచాలని పిలుపునిచ్చారు. చెరువులను నింపడం, ఇంకుడు గుంతలు, చెక్‌డ్యామ్‌ల పునరుద్ధరణ చేపట్టాలని, 100 రోజుల్లో భూగర్భ జలాల పెంపుపై నీటి సంఘాలు క్షేత్రస్థాయిలో పని చేయాలని మంత్రి పేర్కొన్నారు. ప్రస్తుతం 300 అడుగులు తవ్వినా నీరు అందుబాటులో లేకపోవడం ఆందోళనకరమని చెప్పారు. మరో మూడు నెలల్లో వర్షాకాలం ప్రారంభమవుతుందని, అప్పటికి మూడు మీటర్లలోనే నీరు లభించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. "భూమిలో నీరు ఉంటే అది రిజర్వ్ బ్యాంక్‌లాంటిది" అని వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో 60 వేల నీటి సంఘాలు ఉన్నాయని గుర్తుచేసిన మంత్రి, రైతులకు సాగునీరు, పరిశ్రమలకు నీటి సరఫరా కోసం ముందస్తు ప్రణాళిక అవసరమని తెలిపారు. అలాగే, 2014-19 కాలంలో వంశధార రిజర్వాయర్ పనుల్లో 96 శాతం పూర్తి చేశామని, రిజర్వాయర్ కోసం ఐదు గ్రామాలను ఖాళీ చేయించి రూ.500 కోట్లు చెల్లించామని వెల్లడించారు. తమ ప్రభుత్వం తర్వాత ఆ ప్రాజెక్టుపై ఖర్చు జరగలేదని విమర్శించారు. నేరడి బ్యారేజ్ వివాదానికి ట్రిబ్యునల్ గ్రీన్ సిగల్ రావడం జిల్లాకు పెద్ద విజయమని పేర్కొన్న మంత్రి, దీనికోసం తమ ప్రభుత్వం 18 నెలలు కోర్టులో పోరాడిందన్నారు. ఈ అంశంపై వైసీపీ నాయకులు స్పందించలేదని విమర్శించారు. వంశధార లిఫ్ట్ ఇరిగేషన్‌లో గత ప్రభుత్వంలో భారీ అవినీతి జరిగిందని ఆరోపిస్తూ, కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించకపోవడంతో పనులు నిలిచిపోయాయని తెలిపారు.

## రాష్ట్రపతి భవన్‌కు చేరిన.. అమరావతి చటబద్ధత బిల్లు



**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** ఆంధ్రప్రదేశ్ రాజధాని అమ రావతికి శాశ్వత చట్టబద్ధత కల్పించే దిశగా కీలక ముందడుగు పడింది. పార్లమెంట్ ఉభయ సభల ఆమోదం పొందిన ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్ట సవరణ బిల్లు-2026.. సోమవారం రాష్ట్రపతి భవన్‌కు చేరుకుంది. లోక్ సభ సచివాలయం ఈ బిల్లును రాష్ట్రపతి ఆమోదం కోసం పంపింది. అమరావతి చట్టబద్ధతపై పార్లమెంట్‌లో అత్యంత కీలకమైన ఘట్టం ముగిసింది. లోక్ సభ, రాజ్య సభలో సుమారు ఐదు గంటల పాటు ఈ బిల్లుపై చర్చ జరిగింది. వివిధ పార్టీల సభ్యులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేయగా.. కేంద్ర ప్రభుత్వం బిల్లు ప్రాధాన్యాన్ని వివరించింది. చర్చ అనంతరం ఎలాంటి సవరణలు లేకుండా ఉభయ సభలు ఆమోదం తెలిపాయి. ప్రస్తుతం ఈ బిల్లు రాష్ట్రపతి పరిశీలనలో ఉంది. రాజ్యాంగ నిబంధనల ప్రకారం న్యాయనిపుణులతో సంప్రదింపులు జరిపిన అనంతరం రాష్ట్రపతి సంతకం చేయనున్నారు. రాష్ట్రపతి ఆమోదం తర్వాత హిందీ, ఆంగ్ల భాషల్లో గెజిట్ నోటిఫికేషన్ వెలువడనుంది.

## అసోంలో చొరబాటుదారులకు కాంగ్రెస్ మద్దతు: మోడీ



**అస్సాం:** కాంగ్రెస్ పార్టీపై ప్రధాని నరేంద్ర మోడీ సోమవారం విమర్శల వర్షం గుప్పించారు. అసోంలో చొరబాటుదారులకు కాంగ్రెస్ మద్దతు ఇస్తోందని, అక్రమ భూఆక్రమణలకు వ్యతిరేకంగా ప్రభుత్వం చేపడుతున్న చర్యలను అడ్డుకుంటోందని ఆరోపించారు. బార్పేటలో జరిగిన బహిరంగ సభలో ప్రసంగించిన ఆయన, చొరబాటుదారులను 'బాధితులు'గా పరిగణించే చట్టాలను తీసుకురావడానికి కాంగ్రెస్ ప్రయత్నిస్తోందని, దీని ద్వారా స్వదేశీ ప్రజలు ప్రమాదంలో పడుతుందని మోదీ పేర్కొన్నారు. "బీజేపీ అసోంలోని అక్రమ భూఆక్రమణలను అరికట్టాలని చూస్తోంది. కానీ కాంగ్రెస్ బహిరంగంగానే చొరబాటుదారులకు మద్దతు ఇస్తోంది. పైగా అక్రమ ఆక్రమణలకు అడ్డుకట్టవేసేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వ్యతిరేకిస్తోంది. అసోంలో కాంగ్రెస్ ఎలాంటి చట్టాన్ని తీసుకురావాలని అనుకుంటోందంటే, ఎవరైనా చొరబాటుదారుడు అనే పదాన్ని ఉపయోగిస్తే, వారు జైలుకు వెళ్లే పరిస్థితి వస్తుంది. కాంగ్రెస్? పార్టీ చట్టంలోనే చొరబాటుదారులను 'బాధితులు'గా పరిగణిస్తుంది. దీని వల్ల మెజారిటీ స్వదేశీ ప్రజలు జైలు శిక్ష ముప్పును ఎదుర్కోవాల్సి వస్తుంది." అని మోడీ తెలియజేశారు. అసోం సాంస్కృతిక, ఆధ్యాత్మిక వారసత్వాన్ని నొక్కి చెబుతూ, బోడో సామాజిక వర్గానికి చెందిన 'హుదుమ్ పూజ', కోచ్?-రాజ్?బోంగ్షి వర్గానికి చెందిన 'బాతో' అనేవి అసోం సంస్కృతి, ప్రకృతి, విశ్వాసాల మధ్య ఉన్న సామరస్యానికి ఉదాహరణలుగా ఉన్నాయని మోదీ పేర్కొన్నారు. అయితే కాంగ్రెస్ పార్టీ మాత్రం రాష్ట్ర ప్రయోజనాల కంటే, రాజకీయ అధికారానికే అధిక ప్రాధాన్యత ఇచ్చిందని, అందువల్ల అసోం సంప్రదాయాలకు గొప్ప నష్టం వాటిల్లిందని ఆయన అన్నారు. మహిళా రిజర్వేషన్ చట్టం అమలు కోసం పార్లమెంట్ ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేస్తుండడంపై విపక్షాలు విమర్శలు చేస్తున్నాయి. దీనిపై కూడా మోదీ స్పందించారు. మహిళా రిజర్వేషన్ల వల్ల ఏ రాష్ట్ర ప్రాతినిధ్యానికీ భంగం వాటిల్లదని ఆయన పేర్కొన్నారు. అందువల్ల అన్ని రాజకీయ పార్టీల నేతలు కలిసి రావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఈశాన్య, దక్షిణాది రాష్ట్రాల్లో అమలులో ఉన్న జనాభా నియంత్రణ చర్యల గురించి కూడా ఆయన ప్రస్తావించారు.

## రైలు నుండి జారిపడి సిఐఎస్ఎఫ్ సబ్ ఇన్‌స్పెక్టర్ మృతి



**ఏలూరు, పతాకం న్యూస్:** ఏలూరుకు చెందిన సిఐఎస్ఎఫ్ సబ్ ఇన్‌స్పెక్టర్ రైలు నుండి జారిపడి మృతి చెందాడు. అతని పార్థివదేహాన్ని ఏలూరు నగరంలోని ప్రత్యేక ప్రాంతానికి తరలిస్తున్నారు. ఏలూరు పట్టేబాదుకు చెందిన గోపిరెడ్డి హేమంత్ ప్రస్తుతం సిఐఎస్ఎఫ్ ఎస్ఐగా పనిచేస్తున్నారు ఆయన పశ్చిమ బెంగాల్ లో ఎన్నికల నేపథ్యంలో ఢిల్లీ నుండి రైలులో వెస్ట్ బెంగాల్ కు ప్రయాణిస్తున్నారు. మార్గమధ్యంలో ప్రమాదవశాత్తు అతను రైలు నుండి జారిపడి మృతి చెందారు. అతని మృతదేహాన్ని సోమవారం ఏలూరు నగరంలోని పతే బాధ లోని స్వగృహానికి తరలిస్తున్నారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

(మొదటిపేజీ తరువాయి)

## బాధ్యత: చంద్రబాబు

భూగర్భ జలాలు బాగా పెరిగాయన్నారు. భూగర్భ జలాలు పెరిగితే కరెంట్ ఖర్చులు కూడా తగ్గుతాయన్నారు. "శ్రీశైలం, మల్యాలలో పంపులు పెట్టి నీరు తెస్తున్నాం. యాడికి మండలాన్ని పూర్తిగా సస్యశ్యామలం చేసే బాధ్యత మాది. ఈ ఏడాది 70 టీఎంసీల నీటిని అనంతపురం జిల్లాకు తీసుకువచ్చాం. నీరు సమృద్ధిగా ఉంటేనే రాయలసీమ రతనాలసీమగా మారుతుంది. దేశంలోనే ఎక్కువ పళ్లు, కూరగాయలు పండే జిల్లాగా అనంతపురాన్ని మారుస్తాం. గోదావరి, కృష్ణా నుంచి వేల టీఎంసీలు సముద్రంలోకి వృథాగా పోతున్నాయి. గంగా నుంచి కావేరి వరకు నదుల అనుసంధానం జరగాలి. ఈ 21 నెలల్లో పోలవరం డయాఫ్రం వాల్ కొత్తది కట్టాం" అని చంద్రబాబు తెలిపారు. "వర్షపు నీటి విలువ రాయలసీమ రైతులకు బాగా తెలుసు. గతంలోనే ఇంకుడుగుంతలు, పంటకుంటలు తవ్వించాం. ఎన్టీఆర్ జలసిరి, నీరు-మీరు, నీరు ప్రగతి తీసుకువచ్చాం. మైక్రో ఇరిగేషన్‌లో దేశంలోనే నంబర్ వన్‌గా ఉన్నాం. రాయలసీమలో 63 శాతం పంటలను మైక్రో ఇరిగేషన్ కిందికి తీసుకొచ్చాం. మైక్రో, డ్రిప్ ఇరిగేషన్ వల్ల రాయలసీమ హార్టీకల్చర్ హబ్‌గా తయారైంది. వచ్చే ఏడాది గోదావరి పుష్కరాల కంటే ముందే పోలవరాన్ని పూర్తి చేస్తాం. పెండింగ్ సాగునీటి ప్రాజెక్టులన్నింటినీ పూర్తి చేస్తాం. రాష్ట్రంలోని జలాశయాలన్నీ జలకళ సంతరించుకున్నాయి. నీటిని నిల్వ చేసుకుంటే చాలు అదే సంపద సృష్టిస్తుంది" అని చంద్రబాబు అన్నారు. "నీటిబొట్టు విలువ ప్రతి ఒక్కరూ గ్రహించాలి. భూమినే ఒక జలాశయంగా మార్చుకోవాలి. గతంలోనే ఇంకుడుగుంతలు, పంటకుంటలు తవ్వించాం. ఎన్టీఆర్ జలసిరి, నీరు-మీరు, నీరు-ప్రగతి తీసుకువచ్చాం. పరిగెత్తే నీటిని నడిపించాలి, నడిచే నీటిని పంటలకు మళ్లించాలి. రాయలసీమలోని 20 వేల చెరువులు పూర్తిగా నింపాం. భూగర్భ జలాలు పెంచాం, ఇంకా పెంచేందుకు చర్యలు. ప్రతీ ఎకరాకు నీరిచ్చే బాధ్యత ప్రభుత్వానిది. గోదావరి, కృష్ణా నుంచి వేల టీఎంసీలు సముద్రంలోకి వృథాగా పోతున్నాయి. రాష్ట్రంలోని జలాశయాలన్నీ జలకళ సంతరించుకున్నాయి. నీళ్లు నిల్వ ఉంచుకుంటే చాలు, అవే సంపద సృష్టిస్తాయి." - సీఎం చంద్రబాబు జగన్‌కు పిచ్చి ముదిరింది : నదుల అనుసంధానంతో ఏపీకి నీటి భద్రత కల్పిస్తామన్న సీఎం సాగునీటి చెరువులు, కాలువలను పునరుద్ధరించే విషయంలో రాజీ పడొద్దని అధికారులకు తేల్చిచెప్పారు. ఇదే సమయంలో అమరావతి విషయంలో వైఎస్సార్సీపీ తీరును తూర్పారబట్టిన చంద్రబాబు, జగన్‌కు పిచ్చి ముదిరిందని ఎద్దేవా చేశారు. మావిగన్ అంటూ పిచ్చి మాటలు మాట్లాడుతున్నారని వైఎస్సార్సీపీపై సీఎం చంద్రబాబు విరుచుకుపడ్డారు. వారికి మావిగన్ పిచ్చి ముదిరిందని మండిపడ్డారు. "రాష్ట్రంపై పగబట్టారు ఇష్టానుసారం మాట్లాడుతున్నారు. అమరావతి దేవతల రాజధాని పేరు పలికితే పుణ్యం వస్తుంది. అమరావతి పేరు పలకడం ఇష్టం లేకపోతే ఇంట్లోనే ఉండండి. రాష్ట్రానికి ఒకే రాజధాని అది అమరావతి" అని సీఎం స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఏపీకి రూ.21 లక్షల కోట్లు పెట్టుబడులు వచ్చాయన్న చంద్రబాబు, అమరావతి, విశాఖ, తిరుపతి మెగా సిటీలుగా అభివృద్ధి చెందుతాయని చెప్పారు.

# నగరంలో ట్రాఫిక్ ఉల్లంఘనలపై 2,046 కేసులు నమోదు



**విశాఖపట్నం, పతాకం న్యూస్:** నగరంలో ట్రాఫిక్ నిబంధనలకు, మోటార్ వెహికల్ యాక్ట్‌కు విరుద్ధంగా వాహనాలను నడిపిన 2,046 వారిపై కేసులు నమోదుచేసినట్టు సీపీ శంఖబ్రతబాగ్చి ఒక ప్రకటనలో తెలిపారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణలో భాగంగా నిబంధనలు పాటించని వాహనాలపై కేసులు నమోదుచేసి జరిమానా విధిస్తున్నామన్నారు. ఈ నెల మూడో తేదీన హెల్మెట్ ధరించని వారిపై 1,008 కేసులు, పిలియన్ రైడర్ (బైక్ వెనుక కూర్చున్నవారు) హెల్మెట్ ధరించకపోవడంపై 188 కేసులు, ట్రిపుల్ రైడింగ్‌పై 73 కేసులు, ఓవర్‌స్పీడ్ (లేజర్‌గన్స్ సహాయంతో)కు 222 కేసులు, సెల్‌ఫోన్ డ్రైవింగ్‌పై 16 కేసులు, నోపార్కింగ్ ప్రాంతాల్లో వాహనాలను నిలిపినందుకు 119, ఎంవీయాక్ట్ ఉల్లంఘనపై 365, ఇతర ఉల్లంఘనపై మరికొందరిపై కేసులు నమోదుచేసి, జరిమానా విధించామన్నారు. ఇకపై స్పీడ్ డ్రైవింగ్, నోపార్కింగ్ ఉల్లంఘనలపై మరింతగా దృష్టిసారిస్తామన్నారు.

## చందనోత్సవ బస్సుల ఏర్పాటుపై సమీక్ష



**సింహాచలం, పతాకం న్యూస్:** సింహాచలం దేవస్థానం చందనోత్సవానికి నడిపై బస్సులపై ఆర్‌టిసి రీజనల్ మేనేజర్ బి.అప్పలనాయుడు సమీక్షించారు. సింహాచలం డిపోను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ నెల 20వ తేదీన జరిగే చందనోత్సవానికి తగ్గట్టుగా సుమారు 70 బస్సులు కొండ మీదకు, కిందకు నడపాలని, దానికి తగ్గట్టు బస్సులను సిద్ధం చేయాలని ఆదేశించారు. ి భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఎప్పటికప్పుడు బస్సులను తనిఖీ చేసి, రిపేర్లు చేసి సిద్ధంచేయాలన్నారు. ఈ మేరకు సింహాచలం డిపోలో మెకానికల్ సిబ్బంది, డ్రైవర్లు, కండక్టర్లు తగు ఏర్పాట్లు చేసుకోవాలని చెప్పారు. 20వ తేదీ తెల్లవారుజాము నుండి బస్సులను తిప్పాలని చెప్పారు. మెకానికల్ రిలీఫ్ టీమ్‌ను ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ చీఫ్ మెకానికల్ ఇంజినీర్ ఎ.గంగాధర్, డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ కె.పద్మావతి, డిపో మేనేజర్ సింహాచలం, శరత్, అసిస్టెంట్ మేనేజర్ రమణ మూర్తి, అసిస్టెంట్ ఇంజినీర్ కొండలరావు, భద్రుడు తదితరులు పాల్గొన్నారు.

## కోరమాండల్‌లో పేరుకుపోయిన జిప్సం నిల్వలు



**శ్రీహరిపురం, పతాకం న్యూస్:** శ్రీహరిపురంలోని కోరమాండల్ ఇంటర్నేషనల్ ఎరువుల కర్మాగారంలో జిప్సం కొండలా పేరుకుపోయింది. అంచనా మేరకు కర్మాగారంలో సుమారు 20 నుంచి 25 ఎకరాల విస్తీర్ణంలో 10 నుంచి 12 లక్షల జిప్సం నిల్వలున్నాయి. నిబంధనల మేరకు ఎరువుల తయారీలో వచ్చిన జిప్సంను బయటకు తరలించాలి. అయితే యాజమాన్యం ˊరలింపులో నిర్లక్ష్యం చూపుతోందన్న విమర్శలున్నాయి. ఈ నేపథ్యంలో రాష్ట్ర కాలుష్య నియంత్రమండలి చైర్మన్ పి.కృష్ణయ్య రెండురోజులక్రితం విశాఖ పర్యటనకు వచ్చినపుడు కర్మాగారాన్ని తనిఖీచేసి జిప్సం నిల్వలపై ఆరాతీశారు. కర్మాగారం ఆవరణలో ఉన్న జిప్సంను బయటకు తరలించాలని ఆదేశించారు. కోరమాండల్ ఇంటర్నేషనల్ ఎరువుల కర్మాగారంలో ఫాస్ఫేట్ ఎరువుల తయారీ సమయంలో ఉప ఉత్పత్తి (బైప్రోడక్టు)గా జిప్సం(ఫాస్ఫోజిప్సం) ఉత్పత్తి అవుతుంది. అయితే జిప్సంను నిల్వచేసేటప్పుడు జాగ్రత్తలు తీసుకుంటే ఇబ్బంది ఉండదు. ఏటేటా పెరుగుతున్న జిప్సం కొండలా పేరుకుపోయింది. జిప్సం గుట్టలపై టార్పాలిన్లు కప్పడం సాధ్యంకావడంలేదు. అందువల్ల పర్యావరణానికి, ఆరోగ్యానికి నష్టం కలుగుతుందని పర్యావరణవేత్తలు చాలాకాలం నుంచి చెబుతూ వస్తున్నారు. ఏళ్ల తరబడి నిల్వ ఉన్న గుట్టలపై వర్షం పడినపుడు రసాయనాలు భూమిలోకి ఇంకి భూగర్భజలాలు కలుషితమవుతాయి. కొన్ని భార ఖనిజాలు విడుదలై భూమిలోకి ఇంకినపుడు భూగర్భజలాలు తాగేందుకు పనికిరావని పర్యావరణవేత్తలు స్పష్టంచేస్తున్నారు. గాలులు వీచినపుడు ఎండిన జిప్సం పొడి గాలిలో ఎగిరి దుమ్ముగా మారుతుంది. ప్రధానంగా పీఎం 10, పీఎం 2.5 పెరుగుతుంది. గాలి నాణ్యత తగ్గుతుంది. దీనివల్ల శ్వాసకోశ, చర్మ సంబంధ సమస్యలు వస్తున్నాయి. కర్మాగారం పరిసరాల్లో నివసిస్తున్న ప్రజల ఆరోగ్యంపై దీర్ఘకాల ప్రభావం చూపుతుందని స్థానికుల్లో ఆందోళన వ్యక్తమవుతుంది. గత ఏడాది డిసెంబరు నుంచి ఈ ఏడాది జనవరిలో పీసీబీ టాస్క్‌ఫోర్స్ బృందాలు కోరమాండల్ ఇంటర్నేషనల్ కర్మాగారం తనిఖీచేసి జిప్సం గుట్టల నిల్వలపై యాజమాన్యాన్ని అప్రమత్తంచేశారు. గాలిలో నాణ్యత తగ్గడానికి జిప్సమ్ కారణమని గుర్తించి నోటీసులు ఇచ్చారు. తాజాగా పీసీబీ చైర్మన్ కృష్ణయ్య తనిఖీచేసి జిప్సమ్ తరలించాల్సిందేనని స్పష్టంచేశారు. అయితే జిప్సమ్ నిల్వలు పర్యావరణానికి ఇబ్బందిలేకుండా చూస్తామని యాజమాన్య ప్రతినిధులు వివరణ ఇచ్చారు. కర్మాగారంలో హెచ్‌డీపీఎఫ్ లైనింగ్ (సిమెంట్, ఇతర పదార్థాలతో కలిపి) చేసి దానిపైకి జిప్సం నిల్వలు తరలిస్తామని పేర్కొంది. దీనివల్ల భూగర్భజలాలు కలుషితం కాకుండా ఉంటాయని నివేదించింది. కాగా సిమెంట్ తయారీకి జిప్సం వినియోగిస్తున్నారు. ఇంకా రోడ్ల నిర్మాణానికి వాడుతుంటారు. జిప్సం తరలింపు కోసం జాతీయ రహదారుల విభాగం అధికారులతో కంపెనీ ప్రతినిధులు సంప్రదింపులు చేస్తున్నారు. వారు అంగీకరిస్తే కోరమాండల్ కర్మాగారం నుంచి జిప్సం తరలుతుందని అంచనావేస్తున్నారు. అప్పటిలోగా బయటకు తరలించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని పీసీబీ స్పష్టంచేసింది.

## మోడల్ కాలనీగా షీలానగర్ అభివృద్ధి



**గాజువాక, పతాకం న్యూస్:** షీలానగర్ కాలనీని ఒక మోడల్‌గా షీలానగర్ అప్‌కీప్ అండ్ వెల్ఫేర్ అసోసియేషన్ అభివృద్ధి చేసి చూపించిందని గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. అసోసియేషన్ ఆధ్వర్యంలో చేసిన అభివృద్ధి పనులను, కమ్యూనిటీ హాల్ ఆధునీకరణ పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 69వ వార్డులో ఉన్న షీలానగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ఈ కాలనీ అభివృద్ధికి చాలా కృషి చేసిందని చెప్పారు. ఇంకా కాలనీ అభివృద్ధికి ఏవైనా సహాయసహకారం కావాలంటే తాను అందిస్తానని హామీ ఇచ్చారు. కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యదర్శి వై.సత్యవతి మాట్లాడుతూ, ఈ కాలనీ 1981 సంవత్సరంలో ఏర్పడిందని, అప్పటి నుంచి కాలనీ అసోసియేషన్స్ ఆధ్వర్యంలో అభివృద్ధికి కషి చేస్తూనే ఉన్నామని తెలిపారు. షీలానగర్‌లో రెండు పార్కులను జీవిఎంసి నిర్మించిందని, కాలనీ సొంత నిధులతో అభివృద్ధి పనులు చేస్తున్నామని చెప్పారు. కొన్ని స్థలాలలో జిమ్ ఐటమ్స్, పిల్లలు ఆడుకోవడానికి జారుడు బల్లలు ఉయ్యాలలు ఏర్పాటుచేశామన్నారు. కాలనీవాసులందరూ ఐక్యమత్యంతో ఉంటే ఏ సమస్య వచ్చినా ప్రజా ప్రతినిధులను, ప్రభుత్వ అధికారులను సంప్రదించి చేసుకోగలమని చెప్పారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు పిఎస్‌ఎన్.రాజు, ఎస్.సత్యారావు, సుబ్బరాజు, శ్రీనివాసరావు, వెంకటేశ్వరరావు, శ్రీనివాస్, కృష్ణమోహన్, జిసిఎస్.నాయుడు, కాలనీవాసులు భవాని, లక్ష్మి, జి.మణి, జానకి, శరత్‌చంద్ర, ఐ.గాంధీ, అర్జునరావు, గోపాలరాజు పాల్గొన్నారు.

## ముత్యాలమ్మ జాతరకు స్థల సమస్య



**చింతపల్లి, పతాకం న్యూస్:** స్థానిక ముత్యాలమ్మ జాతరలో సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు స్థల సమస్య నెలకొంది. సాంస్కృతిక కార్యక్రమాల వేదికల ఏర్పాటుపై సందిగ్ధం నెలకొంది. గత కొన్నేళ్లుగా ప్రధాన వినోద కార్యక్రమాల వేదికగా ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో ఇప్పుడు టైప్-2 కస్తూర్బా గాంధీ పాఠశాలను నిర్మిస్తున్నారు. దీంతో వేదిక ఏర్పాటు చేసేందుకు స్థలం సరిపడడం లేదు. రెండో వేదికను సబ్ జైలు వద్ద ఏర్పాటు చేస్తుండగా, ట్రాఫిక్ సమస్య నెలకొంటోందని పోలీసులు అనుమతించేందుకు నిరాకరిస్తున్నారు. తాజా పరిస్థితుల నేపథ్యంలో సాంస్కృతిక కార్యక్రమాల వేదికల ఏర్పాటుపై ఉత్సవ కమిటీ ప్రతినిధులు మల్లగుల్లాలు పడుతున్నారు. ముత్యాలమ్మ జాతర ఈ నెల 14 నుంచి 17 వరకు జరగనున్నది. జాతర 15న ప్రారంభంకానుంది. సాంస్కృతిక కార్యక్రమాల ప్రధాన వేదికను జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గత ఏడాది వరకు ఏర్పాటు చేసేవారు. అయితే ఆరు నెలల క్రితం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రూ.2 కోట్లతో బాలికల వసతి కోసం టైప్-2 కస్తూర్బాగాంధీ పాఠశాల భవన నిర్మాణం చేపట్టారు. దీని వలన మైదానం విస్తీర్ణం తగ్గిపోయింది. మరో ప్రత్యామ్నాయ స్థలం అందుబాటులో లేక ఈ ఏడాదికి అక్కడే వేదికను ఏర్పాటు చేసేందుకు ఉత్సవ కమిటీ ప్రయత్నిస్తున్నది. ఇక రెండో వేదికను సబ్ జైలు వద్ద ప్రతి ఏడాది ఏర్పాటు చేస్తుండగా, ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోందని, డిగ్రీ కళాశాల మైదానంలో వేదికను ఏర్పాటు చేసుకోవాలని పోలీసులు చెబుతున్నారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా సబ్ జైలు వద్ద వేదికను ఏర్పాటు చేస్తామని, డిగ్రీ కళాశాల మైదానం గ్రామానికి దూరమైపోతుందని ఉత్సవ కమిటీ సభ్యులు పోలీసులకు నచ్చజెప్పారు. అయితే ఇప్పటి వరకు దీనిపై స్పష్టత రాలేదు. ఆర్‌అండ్‌బీ కార్యాలయాల వద్ద ఉన్న మైదానంలో స్టాళ్లు, ముత్యాలమ్మ ఆలయం వద్ద ఉన్న ఖాళీ స్థలంలో భక్తుల కోసం మండపాలను ఏర్పాటు చేస్తున్నారు. ఆర్టీసీ కాంప్లెక్స్ మైదానం జెయింట్‌వీల్స్‌కి కేటాయించారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసేందుకే ఎక్కడా స్థలం లేకుండాపోయింది. దీనిపై ఉత్సవ కమిటీ ఏ నిర్ణయం తీసుకుంటుందో వేచి చూడాలి.

## ఫ్యామిలీ సర్వే చేయాలి

**వేపగుంట, పతాకం న్యూస్:** యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వేను రెండు రోజుల్లో చేయాలని సరిపల్లి గ్రామం సచివాలయ సిబ్బందిని డిప్యూటీ ఎంపిడిఒ కె.రామారావు ఆదేశించారు. సచివాలయాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సిటిజన్ ఈకేవైసీ తక్షణమే చేయాలని చెప్పారు. సిబ్బంది నిర్ణీత సమయంలో హాజరుకావాలని, ధ్రువీకరణ పత్రాల కోసం వచ్చిన అభ్యర్థులకు కాలయాపన చేయకుండా వెంటనే అందించాలని ఆదేశించారు. సిబ్బందిపై ఫిర్యాదులు వస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న డిప్యూటీ ఎంపిడిఒ రామారావు

## ఈపీఎస్ కనీస పెన్షన్ రూ.9 వేలు చెల్లించాలి



**గాజువాక, పతాకం న్యూస్:** ఇపిఎస్ 95 పెన్షన్ దారులకు కనీస పెన్షన్ రూ.9 వేలు చెల్లించాలని స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) అధ్యక్షులు యు.రామస్వామి డిమాండ్‌చేశారు. ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హౌసింగ్ బోర్డ్ కాలనీలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా రామస్వామి హాజరై మాట్లాడుతూ, కనీస పెన్షన్ పెరిగి నేటికి 12 సంవత్సరాలు అయిందని, నేటికీ అమలు కావడం లేదని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతుందన్నారు. పబ్లిక్ సెక్టర్ కంపెనీలో 30 సంవత్సరాలు పని చేసిన కార్మికులకు చాలా తక్కువ పెన్షన్ చెల్లిస్తున్నారని విమర్శించారు. కనీస పెన్షన్ రూ.9 వేలు, దానికనుగుణంగా డిఎ కూడా ఇవ్వాలని, భార్యాభర్తలకు మెడికల్ సౌకర్యం కల్పించాలని డిమాండ్‌చేశారు. ఐఎన్‌టియుసి నాయకులు రమణమూర్తి మాట్లాడుతూ, స్టీల్‌ప్లాంట్‌లో రిటైర్డ్ అయిన ఎంప్లాయీస్ మెడికల్ ఇన్స్యూరెన్స్ పాత పద్ధతిన కొనసాగించాలని కోరారు. అసోసియేషన్ జిల్లా కార్యదర్శి శీను మాట్లాడుతూ త్వరలోనే రాష్ట్ర మహాసభలు జరగనున్నట్లు తెలిపారు. భార్య భర్తలకు మెడికల్ సౌకర్యం, తెల్ల రేషన్ కార్డు డిమాండ్ల సాధన కోసం కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు కె.దీనబంధ్, నమ్మి అప్పలనాయుడు, పులి గుర్రప్ప, వెంకటేశ్వరరావు, మేడిశెట్టి వెంకట్రావు, ఎన్‌వి.రమణ, లక్ష్మినాయుడు పాల్గొన్నారు.

## ముగిసిన హెచ్‌పీవీ వ్యాక్సిన్ శిబిరం



**విశాఖపట్నం, పతాకం న్యూస్:** విశాఖపట్నం పోర్టు సహకారంతో ప్రభుత్వ క్వీన్ మేరీ పాఠశాలలో చదువుతున్న 9 నుండి 14 ఏళ్లలోపు బాలికలకు గర్భాశయ ముఖద్వార కేన్సర్ రాకుండా సీతమ్మధారలోని లయన్స్ కేన్సర్ ఆసుపత్రిలో రెండు రోజులపాటు నిర్వహించిన హెచ్‌పివి వ్యాక్సినేషన్ శిబిరం ముగిసింది. సుమారు 200 మందికి పైగా బాలికలు ఈ టీకాలు వేయించుకున్నారు. ఈ సందర్భంగా చైతన్య ప్రవంతి స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షులు డాక్టర్ షిరీన్ రహమాన్ మాట్లాడుతూ, రెండు రోజుల పాటు నిర్వహించిన ఈ శిబిరానికి పోర్టు ట్రస్టుతో పాటు ఇతర సంస్థలు అందించిన సహకారం మరువలేనిదన్నారు. ఈ కార్యక్రమంలో సీరం ఇనిస్టిట్యూట్ ఏరియా మేనేజర్ రాంరతన్, చైతన్య ప్రవంతి ప్రతినిధులు విజయ రుకియాభాను, శారద, రోజా, ఎస్.లక్ష్మి, కుమారి, అనసూయ, జి.లక్ష్మి, సిహెచ్.లక్ష్మి, పి.సుజాత, ఉమ, తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాల్లో ఇటుకల పండుగ సందడి



**ముంచంగిపుట్టు, పతాకం న్యూస్:** మండలంలోని గిరిజన గ్రామాల్లో ఇటుకల పండుగ సందడి మొదలైంది. జంగంసరియా, మజ్జిగూడ, బోడిపుట్టు, తదితర గ్రామాల్లో ఇటుకల పండుగ సందర్భంగా పెద్ద వేట ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ప్రజలందరికీ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలను ప్రసాదించాలని కోరుకుంటూ గ్రామస్థులు శంకుదేవుడు(గ్రామ దేవత)ను వేడుకున్నారు. ఈ పండుగను పది రోజుల పాటు నిర్వహిస్తారు.

## జట్టీ నిర్మాణానికి స్థల పరిశీలన



**నక్కపల్లి, పతాకం న్యూస్:** నక్కపల్లి మండలం తీర ప్రాంతానికి ప్రభుత్వం జట్టీని మంజూరు చేసిన నేపథ్యంలో మత్స్యశాఖాధికారులు, టీడీపీ నాయకులు స్థల పరిశీలన చేశారు. హోం మంత్రి అనిత ఆదేశాల మేరకు మత్స్యశాఖ జిల్లా అధికారి విజయ్, ఎఫ్‌డీవో శృతి, టీడీపీ నియోజకవర కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేశ్, మత్స్యకార సొసైటీ అధ్యక్షుడు పిక్కి కోదండరావు ఆధ్వర్యంలో బోయపాడు గ్రామంలో పర్యటించారు. సుమారు 32 కోట్ల వ్యయంతో నిర్మించనున్న జట్టీకి సంబంధించి తీరం వెంబడి స్థల పరిశీలన చేశారు. త్వరలో జట్టీ నిర్మాణ పనులకు హోం మంత్రి ఆధ్వర్యంలో శంకుస్థాపన జరుగుతుందని కొప్పిశెట్టి వెంకటేశ్ చెప్పారు. ఈ కార్యక్రమంలో మత్స్యకార సంఘాల ప్రతినిధులు, టీడీపీ నాయకులు పిక్కి శ్రీను, పిక్కి సత్తియ్య, పిక్కి గంగరాజు, పూజారి పిక్కిదేముడు, పెదతీనార్ల ఎంపీటీసీ సభ్యుడు మేరుగు నాగేశ్వరరావు, సిరిపిల్లి అప్పలరాజు, జనసేన నాయకులు బొంది గుర్రన్న, పిక్కికొండలరావు పాల్గొన్నారు.

## జూలైలో లేదా ఆగస్టులో ప్రారంభం కానున్న భోగాపురం ఎయిర్‌పోర్టు



**భోగాపురం, పతాకం న్యూస్:** భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభానికి సంబంధించి సన్నాహాలు వేగంగా కొనసాగుతున్నాయని రహదారులు, భవనాల శాఖ మంత్రి బి.సి.జనార్దన్ రెడ్డి వెల్లడించారు. విమానాశ్రయాన్ని జులై 5, 8 లేదా ఆగస్టు 17, 19 తేదీలలో ఏదో ఒక రోజున ప్రారంభించే అవకాశాలు ఉన్నట్లు తెలిపారు. ప్రధాన మంత్రి అపాయింట్మెంట్, ఆ రోజులలో మంచి రోజు చూసి ముఖ్యమంత్రి నిర్ణయం తీసుకుంటారని స్పష్టం చేశారు. మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌తో కలిసి భోగాపురంలోని అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రాయ పనులను ఆయన పరిశీలించారు. అనంతరం పాత్రికేయ సమావేశంలో మంత్రి మాట్లాడారు. 2014లో ఈ ప్రాజెక్టుకు శంకుస్థాపన జరిగినప్పటికీ, గత ప్రభుత్వ కాలంలో పనులు మందగించాయని విమర్శించారు. భోగాపురం ఎయిర్‌పోర్ట్ నిర్మాణానికి సంబంధించి క్రెడిట్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడుకే దక్కుతుందని చెప్పారు. ఎయిర్‌పోర్ట్‌కు అవసరమైన కనెక్టివిటీ రోడ్ల అభివృద్ధి పనులు కూడా త్వరలో పూర్తి చేయనున్నట్లు తెలిపారు. ఎయిర్‌పోర్టు పనులు 98.74 శాతం పూర్తయినట్లు చెప్పారు. విశాఖపట్నం నుండి 7 ప్రాధాన్య రహదారుల అభివృద్ధి పనులు ప్రగతిలో ఉండగా, ఆనందపురం జంక్షన్ వద్ద ఎలివేటెడ్ రోడ్ డిపిఆర్ తయారీ జరుగుతోందని తెలిపారు. బీచ్ రోడ్ కారిడార్ అలైన్‌మెంట్ ఫైనలైజేషన్ పూర్తయిందన్నారు. భోగాపురం గ్రీన్ ఫీల్డ్ అంతర్జాతీయ విమానాశ్రయం పనుల పురోగతిపై అధికారులతో సమీక్ష నిర్వహించానని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. విమానాశ్రయానికి అనుసంధాన రహదారుల అభివృద్ధిపై ప్రధానంగా చర్చ జరిగినట్లు తెలిపారు. విశాఖపట్నం నగరం నుండి విమానాశ్రయానికి సులభ రాకపోకల కోసం చేపడుతున్న రోడ్ల పనులను వేగవంతం చేయాలని అధికారులకు సూచించామన్నారు. ఎమ్‌పి కలిశెట్టి అప్పలనాయుడు మాట్లాడుతూ భోగాపురం ఎయిర్పోర్ట్ ఉత్తరాంధ్రకు మణిహారమని అన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ ఎస్ రాంసుందర్ రెడ్డి, నెల్లిమర్ల, విజయనగరం ఎమ్మెల్యేలు లోకం మాధవి, అదితి గజపతి రాజు, మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు, ఎయిర్‌పోర్టు అథారిటీ ఎమ్‌డి ప్రవీణ్ ఆదిత్య, ఎయిర్‌పోర్టు సిఇఒ అన్వర్ బీర్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

## తలసీమియా పిల్లల కోసం రక్తదానం




**విజయనగరం, పతాకం న్యూస్:** ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని విజయనగరం జిల్లా అల్లు అర్జున్ ఫాన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమం నిర్వహించారు. తలసీమియా వ్యాధితో బాధపడుతూ ప్రతి 21 రోజులకు రక్త మార్పిడి అవసరమయ్యే చిన్నారుల కోసం ఎన్‌వీఎన్ బ్లడ్ బ్యాంక్‌లో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా ఉన్న అల్లు అర్జున్ అభిమానులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. తమ అభిమాన హీరో పుట్టినరోజును సేవా కార్యక్రమంతో జరుపుకోవడం ద్వారా సమాజానికి మంచి సందేశాన్ని అందించారు. యువత రక్తదానం తలసీమియా పిల్లల ప్రాణాలు కాపాడటానికి సహాయపడిందని నిర్వాహకులు తెలిపారు. ఇటువంటి కార్యక్రమాలు మరింతగా నిర్వహించాలని వారు ఆకాంక్షించారు

## గ్యాస్ డీలర్ పై దాడి జరిగితే సరఫరా నిలుపుదల : ఎల్పీజీ డీలర్ అసోసియేషన్




**ఇచ్ఛాపురం, పతాకం న్యూస్:** రాష్ట్ర వ్యాప్తంగా ఎక్కడైనా గ్యాస్ డీలర్ పై దాడి జరిగితే గ్యాస్ సిలిండర్ సరఫరా నిలుపుదల తప్పదు అని ఎల్పీజీ డీలర్ అసోసియేషన్ హెచ్చరించింది. ఇటీవల ఇచ్ఛాపురం గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధి వెంకటేష్ పై అకారణంగా దాడి జరగడం పట్ల యూనియన్ తీవ్రంగా ఖండించింది. సంఘీభావం తెలిపేందుకు రాష్ట్ర వ్యాప్తంగా ఎల్పీజీ డీలర్ అసోసియేషన్ ప్రతినిధులు బృందం వచ్చారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు కె. శ్రీనాథ్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ, ఆయిల్ కంపెనీలు నిభందనలు ప్రకారమే ఓటిపి ఉన్నవారికే గ్యాస్ సరఫరా చేస్తున్నాము అని, కొన్ని సాంకేతిక సమస్యలు వల్ల గ్యాస్ బుక్ కాకపోయిన, ఇవ్వలేని పరిస్థితులు ఉన్నాయని అన్నారు. నిజంగా గ్యాస్ ఏజెన్స్ తప్పు చేస్తే పిర్యాదులు చెయ్యడానికి అనేక వ్యవస్థలు ఉన్నాయి అని అన్నారు. ఇవన్నీ విడిచిపెట్టి డీలర్ పై భౌతిక దాడులు చేస్తే సహించేది లేదని, ఇలాంటి ఘటనలు పునరావఅతం కాకుండా ప్రజలు కూడా సహకరించాలి అన్నారు. లేదు దాడులు చేస్తాం అంటే రాష్ట్ర వ్యాప్తంగా ఎల్పీజీ సిలిండర్ సరఫరా నిలుపుదల చెయ్యడానికి వెనుకడమని రాష్ట్ర అధ్యక్షులు శ్రీనాథ్ రెడ్డి స్పష్టం చేశారు. ఓటి పి ల విషయం లో ఎల్పీజీ కంపెనీలు కనీసం 25 శాతం వెసులు బాటు కల్పించాలని కోరనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం లో వివిధ జిల్లా లు నుండు వచ్చిన ఎల్పీజీ కంపెనీ డీలర్లు పాల్గొన్నారు.

# భవన నిర్మాణ కార్మికుల ధర్నా..




**విజయనగరం, పతాకం న్యూస్:** భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డుని పునరుద్ధరించి 2020 సెప్టెంబర్ 7 నుంచి పెండింగ్లో ఉన్న క్లైమ్ లన్ని చెల్లించాలని విజయనగరం జిల్లా భవన నిర్మాణ కార్మిక సంఘం (సి ఐ టి యు) ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. యూనియన్ జిల్లా కార్యదర్శి బి. రమణ, రాష్ట్ర కమిటీ సభ్యులు కే.అసరప్పడు, సిఐటియు జిల్లా కోశాధికారి ఏ.జగన్మోహన్రావు లు మాట్లాడుతూ .... ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికులకు ఇచ్చిన హామీల అమలు చేయాలని డిమాండ్ చేశారు. 2020 సెప్టెంబర్ 7 నుంచి గత ప్రభుత్వం సంక్షేమ బోర్డుని నిలిపివేసిందని, గత 5 సంవత్సరాలుగా భవన నిర్మాణ కార్మికుల పిల్లలకు స్కాలర్ షిప్స్, డెలివరీ, వివాహ, డెత్ , పాక్షిక, పూర్తి అంగవైకల్యం సంభవించే సందర్భంలో సంక్షేమ బోర్డు ద్వారా కార్మికులకు రావలసిన బెనిఫిట్స్ అన్ని అమలు కాకపోవడంతో నిర్మాణ కార్మికులు ఇబ్బందులకు గురయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఇసుకపై కొంత సడలింపు ఇచ్చిన సంక్షేమ పథకాల అమల్లో జాప్యం చేసిందన్నారు. గత సంవత్సర కాలంగా పోరాడితే 2026 మార్చి ఒకటి నుంచి నిర్మాణ కార్మిక బిడ్డలకు వివాహానికి 40000, ప్రసూతి కి 20000, మట్టి ఖర్చులు 20,000/- , సహజ మరణానికి 60000 ప్రకటించిందని, వీటిని కార్మిక శాఖ ద్వారా మాత్రమే అమలు చేయాలన్నారు. వీటితోపాటు యాక్సిడెంట్లు బెనిఫిట్ 10 లక్షలు, పాక్షిక, పూర్తి అంగ వైకల్యానికి 5 లక్షలు, పిల్లలకు స్కాలర్షిప్స్, కార్మికులకు పనిముట్లు సంక్షేమ బోర్డు ద్వారా అమలు చేయాలన్నారు. 2020 సెప్టెంబర్ 7 నుంచి పెండింగ్లో ఉన్న క్లైమ్ లు చెల్లించాలని, రెన్యువల్ ,రిజిస్ట్రేషన్ ప్రక్రియ వేగవంతం చేయాలని, 50 సంవత్సరాల పూర్తయిన కార్మికులకు సంక్షేమ బోర్డు ద్వారా పెన్షన్ మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. వీటికి ప్రభుత్వ ఖజానా నుంచి ఒక్క రూపాయి అదనంగా చెల్లించాల్సిన అవసరం లేదని, నిర్మాణ చెస్ నుంచి వచ్చిన డబ్బులను దారి మళ్ళించకుండా కార్మికుల సంక్షేమానికి ఖర్చు చేయాలని, లేనిపక్షంలో భవిష్యత్తులో కార్మికులను పెద్ద ఎత్తున ఆందోళనకు సిద్ధం చేస్తామని తెలిపారు. జిల్లా కమిటీ సభ్యులు బలసా శ్రీను, నాయకులు పెంటయ్య, రమణ, అప్పలనాయుడు, భాస్కర్ రావు, రామారావు, రాజు తదితరులు పాల్గొన్నారు.

## పాత పద్ధతిలోనే 'ఉపాధి హామీ' కొనసాగించాలి



**కొమరాడ, పతాకం న్యూస్:** మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ చట్టాన్ని పాతపద్ధతిలో కొనసాగించాలని, విబిజి రామ్ పథకాన్ని రద్దు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కోశాధికారి కొల్లి సాంబ మూర్తి డిమాండ్ చేశారు. మండలంలో పెద్దశాఖలో ఉపాధి కూలీలతో కలిసి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ చట్టం ప్రకారం కూలీలందరికీ పని కల్పించడం లేదన్నారు. గ్రామాల్లో పది గ్రూపులుంటే ఐదు గ్రూపులకు వారం రోజుల పాటు, మిగతా ఐదు గ్రూపులకు మరో వారం రోజుల పాటు పని కల్పించే పరిస్థితి ఉందని అన్నారు. అలాగే పేస్ యాప్‌ల ద్వారా హాజరును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పని దగ్గరికి వెళ్లి ముఖ ఆధారిత హాజరు పడకపోతే, ఆరోజు ఇంటికి వెళ్లిపోవడం జరుగుతుందని తెలిపారు. దీంతో కూలీలు ఉపాధి హామీ పని లేకుండా పోతుందని అన్నారు. కావున పేస్ యాప్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఒక్క పూట మాత్రమే పని కల్పించాలని, పనిచేసే చోట మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. రోజు కూలి రూ .600, ఏడాదికి 200 పనిదినాలు కల్పించి పాత పద్ధతుల్లోనే ఉపాధి హామీ చట్టాన్ని అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు మధు, జన, చింతామణి, కైలాస్, రవి, పలువురు కూలీలు పాల్గొన్నారు.

## ఇసుక లోడును అడ్డుకున్న గ్రామస్తులు



**శ్రీకాకుళం, పతాకం న్యూస్:** రాగోలు పంచాయితీ బాబాజీ పేట రోడ్డు వద్ద ఇసుక లారీలను గ్రామస్తులు అడ్డుకున్నారు ఆముదాలవలస మండలం దూసి ముద్దాడ పేట కొత్తవలస ఇసుక రాంపులు నుండి రోజు వందలకొద్ది ఇసుకలోళ్లు ఈ రోడ్లపై నుండి రవాణా చేస్తున్నారు. దీంతో రోడ్డుపైన ఇసుక దెబ్బలు ఏర్పడి సైకిళ్లు, వాహనాలు రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగిస్తున్నాయి. ఒక్కొక్కసారి ప్రమాదాలు కూడా జరిగి తీవ్ర గాయాలు అయిన సందర్భాలు కూడా ఉన్నాయి. దీంతో ఇసుక రవాణా చేసిన వారు తమ రోడ్లను బాగు చేయాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. అనంతరం పోలీసులు అక్కడ చేరుకుని ఇరు వర్గాల సమస్యలు విని శాంతింప చేశారు.

## రహదారిపై కారు దగ్ధం



**విజయవాడ, పతాకం న్యూస్:** నగరంలోని కనకదుర్గమ్మ ఫ్లైఓవర్ సమీపంలో రహదారిపై కారులో మంటలు ఒక్కసారిగా చెలరేగాయి. దీంతో స్థానికులు వెంటనే అప్రమత్తమై..కారులో ప్రయాణిస్తున్న వారికి తెలిపారు. వారు వెంటనే కారు ఆపి అందులో నుంచి దిగిపోయారు. ఆ వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. అగ్నిమాపక సిబ్బంది వెంటనే ఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. ఈ ఘటనలో కారు దగ్ధమైంది. షార్ట్ సర్క్యూట్ కారణంగానే కారులో మంటలు చెలరేగినట్లు పోలీసులు భావిస్తున్నారు. రద్దీ ప్రాంతమైన కనకదుర్గమ్మ ఫ్లైఓవర్ వద్ద ఈ ఘటన చోటు చేసుకోవడంతో.. భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. ట్రాఫిక్ పోలీసులు రంగ ప్రవేశం చేసి.. రహదారిపై నుంచి కారును పక్కకు తొలగించారు. అనంతరం ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

## గ్యాస్ కోసం పడిగాపులు



**మాకవరపాలెం పతాకం న్యూస్:** మండల కేంద్రంలో హెచ్‌పీ గ్యాస్ కోసం లబ్ధిదారులు శనివారం పడిగాపులు కాశారు. రెండు వారాలుగా హెచ్‌పీ గ్యాస్ సిలిండర్ల సరఫరా లేకపోవడంతో లబ్ధిదారులు ఉదయం నుంచి బారులుతీరారు. 150కి పైగా సిలిండర్లు పంపిణీ చేయాల్సి ఉండగా, సాయంత్రం అరకొరగా లబ్ధిదారులకు ఇచ్చి చేతులుదులిపేసుకున్నారు. కాగా గ్యాస్ సిలిండర్ బ్లాక్‌లో రూ.1,500 నుంచి రూ.1,700 వరకు అమ్ముతున్నారని, దీనిని అరికట్టడానికి అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని లబ్ధిదారులు ఆరోపిస్తున్నారు.

## ఆంధ్ర రిజర్వాయరు నుంచి నీరు విడుదల



**విజయనగరం, పతాకం న్యూస్:** నగర ప్రజలకు తాగునీటి ఎద్దడి సమస్య లేకుండా ఆంధ్ర రిజర్వాయరు నుంచి అదనపు జలాలను తెప్పిస్తున్నట్లు కమిషనర్ బాలస్వామి తెలిపారు. ప్రజాప్రతినిధులు, కలెక్టర్ రామ్‌సుందర్ రెడ్డి ఆదేశాలతో ఇరిగేషన్ అధికారులు స్పందించి ఆంధ్ర నుంచి నీరు విడుదల చేశారు. నెల్లిమర్ల హెడ్ వాటర్ వర్క్స్, చంపావతి, కుదిపి రిజర్వాయర్ల వద్దకు నీరు వచ్చి చేరుతుంది. ఆంధ్ర నుంచి విడుదలైన జలాలు పిట్టాడ, లక్ష్మీపురం, సాలిపేట, గజపతినగరం, డోలపేట, గంగచోళ్లవలస, తమ్మిరాజుపేట, గరివిడి, మొయిద మీదుగా మూలస్టేషన్‌కు వచ్చి, అక్కడి నుంచి నెల్లిమర్ల పంప్‌హౌస్ వద్దకు వచ్చి చేరుతాయి. మరో వారం రోజుల్లో ఆంధ్ర నుండి నెల్లిమర్ల రిజర్వాయర్‌కు అదనపు జలాలు వచ్చే అవకాశం ఉంది. ఈ సందర్భంగా కమిషనర్ బాలస్వామి మాట్లాడుతూ తాగునీటికి ఇబ్బంది లేకుండా అవసరమైన అన్ని చర్యలను తీసుకుంటున్నామన్నారు. ఇందులో భాగంగా ముందస్తు ఏర్పాట్లు కూడా చేశామన్నారు. జనరేటర్లు, పైపులైను మరమ్మతులు ఇప్పటికే పూర్తి చేశామని చెప్పారు.

## 'మావిగన్'పై ప్రజల్లో జరుగుతున్న చర్చను చూసి ప్రభుత్వానికి భయం పట్టుకుంది: కాకాణి



**నెల్లూరు, పతాకం న్యూస్:** వైసీపీ నాయకుల వ్యక్తిగత జీవితాలు, మహిళలపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేస్తున్నారంటూ మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి మండిపడ్డారు. నెల్లూరులో మీడియాతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం, ఏబీఎన్ రాధాకృష్ణపై ధ్వజమెత్తారు. వైసీపీ అధినేత జగన్ ప్రతిపాదించిన 'మావిగన్'పై ప్రజల్లో జరుగుతున్న చర్చను చూసి కూటమి ప్రభుత్వానికి భయం పట్టుకుందని కాకాణి విమర్శించారు. ఆ చర్చను పక్కదారి పట్టించేందుకే వ్యక్తిగత దాడులకు దిగుతున్నారని ఆరోపించారు. ఏబీఎన్ రాధాకృష్ణ తన 'కొత్త పలుకు' ద్వారా వైసీపీ నేతల కుటుంబ సభ్యులపై, ముఖ్యంగా మహిళలపై విషం చిమ్ముతున్నారని కాకాణి ఆగ్రహం వ్యక్తం చేశారు. జర్నలిజం ముసుగులో రాధాకృష్ణ దళారీ పనులు చేస్తున్నారని విమర్శించారు. రాజకీయ లబ్ధి కోసం మహిళల వ్యక్తిగత జీవితాలను కించపరచడం అత్యంత నీచమైన చర్య అని, దీనిని రాష్ట్రంలోని మహిళా లోకం ఛీత్కరించుకుంటోందని పేర్కొన్నారు. జగన్‌ను ఎంత ఎక్కువగా దూషిస్తే కూటమి ఎమ్మెల్యేలకు అంత మెరుగైన ర్యాంకింగ్స్ ఇస్తామని చంద్రబాబు టార్గెట్లు పెట్టారని కాకాణి ఎద్దేవా చేశారు.

## గల్ఫ్ దేశాలకు నిలిచిన గుడ్ల ఎగుమతి



**గుంటూరు, పతాకం న్యూస్:** యుద్ధం ప్రభావంతో పశ్చిమాసియా దేశాలకు తెలుగు రాష్ట్రాల నుంచి కోడిగుడ్ల ఎగుమతి నిలిచిపోయింది. దీంతో, మన రాష్ట్రంతోపాటు, తెలంగాణలోనూ కోడిగుడ్ల ధర గణనీయంగా పడిపోయింది. పౌల్ట్రీ రంగం సంక్షోభంలో చిక్కుకుంది. తెలుగు రాష్ట్రాల నుంచి గల్ఫ్ దేశాలకు రోజుకు కోటి వరకు గుడ్లు ఎగుమతి జరిగేది. ఇందులో మన రాష్ట్ర నుంచి 40 లక్షల గుడ్లు ఎగుమతి అయ్యేవి. ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయిల్ యుద్ధానికి దిగడం, ఇరాన్ ప్రతిదాడులు చేస్తుండడంతో నెలకొన్న తీవ్ర ఉద్రిక్తతల వల్ల గల్ఫ్ దేశాలకు గుడ్ల ఎగుమతులు నిల్చిపోవడంతో స్థానిక మార్కెట్లో ధర తగ్గిపోయింది. ప్రస్తుతం విజయవాడ, గుంటూరు మార్కెట్లలో కోడిగుడ్ల ధర రూ.4.50కు పడిపోయింది. జనవరిలో ఈ ధర రూ.7 వరకు పలికింది. ఫిబ్రవరిలో రూ.6కు తగ్గింది. ఈ ధర క్రమంగా తగ్గుతూ వస్తోంది. సహజంగా వేసవిలో గుడ్ల వినియోగం కూడా తక్కువగా ఉంటుంది. వాణిజ్య గ్యాస్ కొరత వల్ల హోటళ్లు, తినుబండారాల దుకాణాలు మూతపడడం వల్ల కూడా గుడ్ల వినియోగం మరింత తగ్గింది. దీంతో, పౌల్ట్రీల యజమానులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఫిబ్రవరి రెండో పక్షంలో రూ.5 పలికిన ధర మార్చిలో రూ.3.50కు పడిపోయింది. గత వారం నుంచి ఈ ధర రూ.4.50కు చేరింది. ఒక్కో గుడ్డు ఉత్పత్తికి రూ.4 నుంచి రూ.5 వరకు ఖర్చవుతోందని పౌల్ట్రీల యజమానులు చెబుతున్నారు. కోళ్ల దాణా ఖర్చులూ పెరిగాయి. కోళ్ల దాణాకు వినియోగించే సోయాబిన్, మొక్కజొన్న ధరలు కూడా భారీగా పెరిగాయి. ఒక క్వింటాలు మొక్కజొన్న ధర రూ.1,800 నుంచి రూ.2500, సోయాబిన్ ధర రూ.5 వేల నుంచి రూ.8 వేలకు పెరిగింది. దీంతో, నిర్వహణ ఖర్చులు పెరిగాయి. లక్ష గుడ్లు ఉత్పత్తి చేసే కోళ్ల ఫారంలో రోజుకు రూ.2 లక్షల నుంచి రూ.4 లక్షల వరకు నష్టం వస్తోందని పౌల్ట్రీ పరిశ్రమ వర్గాలు చెప్తున్నాయి. గత కొన్ని రోజులుగా ఉత్పత్తి తగ్గుముఖం పట్టడం వల్ల కొంతమేరకు ధర పెరిగిందని తెలిపాయి. కోడిగుడ్లు ఉత్పత్తి అయిన తర్వాత గరిష్ట నిల్వ కాలం 20 రోజులు. గల్ఫ్ దేశాలతోపాటు రాష్ట్రం నుంచి బెంగాల్, అస్సాం, ఒడిశా, తమిళనాడు రాష్ట్రాలకు ఎగుమతి అవుతుంటాయి. ప్రస్తుతం ఇతర రాష్ట్రాలకు ఎగుమతులు కొనసాగుతున్నా, గల్ఫ్ దేశాలకు నిల్చిపోవడంతో డిమాండ్ బాగా తగ్గింది. ఫిబ్రవరి నుంచి మార్చి చివరి వరకు వలస పక్షుల రాక వల్ల కోళ్లకు వైరస్ సమస్యలు వస్తుంటాయి. ప్రధానంగా బర్డ్ ఫ్లూ వైరస్ భయంతో ఏప్రిల్, మేలో ఉత్పత్తి, వినియోగం తగ్గుతుంది. ఎగుమతి తగ్గడం వల్ల కోళ్ల ఫారాల వారు ఉత్పత్తిని కూడా తగ్గించారు.

## పుష్కరాల విజయవంతానికి కృషి చేయాలి: డీజీపీ




**రాజమహేంద్రవరం, పతాకం న్యూస్:** 2027 గోదావరి పుష్కరాలను అన్ని ప్రభుత్వ శాఖల సమన్వయంతో విజయవంతం చేయాలని రాష్ట్ర డిజిపి హరీష్ కుమార్ గుప్తా ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో గోదావరి పుష్కరాల నిర్వహణ, తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షా సమావేశం జరిగింది. తొలుత జిల్లా ఎస్పి నరసింహకిషోర్ తూర్పుగోదావరి జిల్లా భౌగోళిక స్వరూపం, స్థితిగతులపై ఆయనకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సమీక్షా సమావేశంలో కలెక్టర్ కీర్తి చేకూరి, జాయింట్ కలెక్టర్ వై.మేఘస్వరూప్, మున్సిపల్ కమిషనర్ రాహుల్ మీనా, డిఐజి కె.ఫకీరప్ప, కాకినాడ జిల్లా ఎస్పి బిందు మాధవ్, ఏలూరు జిల్లా ఎస్పి కె.ప్రతాప్ శివకిషోర్, కోనసీమ జిల్లా ఎస్పి రాహుల్‌మీనా ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుష్కరాలను విజయవంతం చేసేందుకు అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయం పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. పుష్కర్ జాయింట్ యాక్షన్ బృందాలను ఏర్పాటు చేయాలన్నారు. ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించడానికి టీమును సంప్రదించి తగు వీధి విధానాలు రూపొందించాలన్నారు. మొన్న ప్రయాగ్‌లో జరిగిన కుంభమేళాను అధ్యయనం చేయడానికి ఒక ప్రత్యేక టీమును అక్కడికి పంపి, తదనుగుణంగా ప్రణాళిక రూపొందించాలన్నారు. అన్ని ఘాట్లలో సిపి కెమెరాలను 24 గంటలూ పర్యవేక్షించేందుకు ఒక ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ ఏర్పాటు చేయాలన్నారు. ట్రాఫిక్ నియంత్రణకు స్టేట్ బోర్డర్స్, డిస్ట్రిక్ట్ బోర్డర్స్ పోలీసులతో సరైన కమ్యూనికేషన్ ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. అన్ని ఘాట్‌లకు స్నానాలకు వచ్చే భక్తులకు నిర్ణీత పరిధికి సంబంధించి తగినన్ని డ్రోన్ల ద్వారా యాత్రికులకు ఎప్పటిప్పుడు రద్దీకి సంబంధించిన సూచనలు తెలియపరచాలన్నారు. పుష్కరాలకు ముందస్తు ఏర్పాట్లలో భాగంగా ఒఎన్‌జిసికి సంబంధించిన హెలికాప్టర్‌ను ఉపయోగించి జాయింట్ ఏరియల్ సర్వే నిర్వహించాలన్నారు. ఎన్‌సిసి, ఎన్ఎస్ఎస్ మరియు ఇతర వాలంటీర్ల సేవలను వినియోగించుకోవాలన్నారు. ఎమర్జెన్సీ రూట్ ప్లాన్‌ను సిద్ధం చేయాలని ఆదేశించారు. ఘాట్‌లకు వచ్చే యాత్రికుల రద్దీని క్రమబద్ధీకరించడానికి టిటిడి దేవస్థానం సంబంధిత అధికారులతో సంప్రదించి ప్రణాళికను రూపొందించాలన్నారు. స్థానాలు ఆచరించే యాత్రికులకు అన్ని ఘాట్లకు సమ ప్రాధాన్యత వచ్చేలా సోషల్ మీడియా ద్వారా అవగాహన కలిగించాలన్నారు. రాజమహేంద్రవరం నగర జనాభా, వాహన సాంద్రతపై గణాంకాలు తయారుచేసి, భవిష్యత్తులో పెరిగే జనాభా, వాహన సాంద్రత పై నిర్దిష్టమైన ప్రణాళిక రూపొందించాలన్నారు. పుష్కరాలలో పనిచేసేటువంటి అన్ని శాఖల సిబ్బందికి భోజన సదుపాయాల(క్లౌడ్ కిచెన్) ఏర్పాటునకు ఒక ఏకీకృతమైనటువంటి సేవా వ్యవస్థను ఏర్పాటు చేయాలని సూచించారు. అతిథి గృహాన్ని ప్రారంభించిన డిజిపినగరంలోని గోకవరం బస్టాండ్ సమీపంలో రానున్న పుష్కరాల సందర్భంగా నిర్మించిన పోలీస్ గెస్ట్ హౌస్ నూతన భవనం, జాంపేట ఓల్డ్ ఎఆర్ కార్యాలయంలో నూతన డాగ్ కెన్నెల్‌ను డిజిపి హరీష్ కుమార్ గుప్తా ప్రారంభించారు. జిల్లా పర్యటనకు వచ్చిన డిజిపి హరీష్ కుమార్ గుప్తా, అడిషనల్ డిజి ఎన్.మధుసూదన్ రెడ్డిలకు ఏలూరు రేంజ్ డిఐజి అశోక్‌కుమార్, ఎస్పి నరసింహకిషోర్ పుష్పగుచ్ఛాలు ఇచ్చి స్వాగతం పలికారు.

# ప్రభుత్వ కార్యాలయాలకు 85 శాతం స్మార్ట్ మీటర్ల ఏర్పాటు పూర్తి



**రాజమహేంద్రవరం, పతాకం న్యూస్:** కూటమి సర్కారు ప్రభుత్వ కార్యాలయాలకు స్మార్ట్ షాక్ ఇచ్చింది. రాబోయే 6 నెలలుగా చాప కింద నీరుగా స్మార్ట్ మీటర్ల ఏర్పాటు ప్రక్రియ నిర్వహించింది. ఈ నేపథ్యంలో ఇప్పటికే ప్రభుత్వ కార్యాలయాలకు స్మార్ట్ మీటర్ల ఏర్పాటు ప్రక్రియను 85 శాతం పూర్తి చేసింది. ఈ నెలాఖరు నాటికి మిగిలిన 15 శాతం పూర్తి చేయనుంది. ప్రి పెయిడ్ మీటర్లు పూర్తి స్థాయిలో వినియోగంలోకి వస్తే ఆఫీసుల వారీగా విద్యుత్ కోటాను కేటాయించనున్నారు. ఆయా కార్యాలయాలు, పంచాయతీలు, మున్సిపాలిటీలు ఆ కోటా పరిమితి లోపే వినియోగించుకోవాలి. పరిధి దాటితే ఎటువంటి సమాచారం లేకుండా సరఫరా నిలిచిపోనుంది. ఏటా ప్రభుత్వ కార్యాలయాల్లో రూ.కోట్ల విద్యుత్ బకాయిలు ఉంటున్నాయి. పంచాయతీల నిర్వహణలో ప్రాథమిక అవసరాల అనంతరం విద్యుత్ బిల్లుల చెల్లింపులు జరుగుతున్నాయి. ఈ పరిస్థితి రాబోయే రోజులలో పూర్తిగా తలకిందులు కానుంది. ప్రభుత్వం సకాలంలో బిల్లులు చెల్లించకుంటే గ్రామాల్లో చీకట్లు కమ్ముకోనున్నాయి. పట్టణాలలో పౌర సేవలూ అంతరాయం కానున్నాయి. 'విద్యుత్ బిల్లులు పెంచం.. స్మార్ట్ మీటర్లు అసలే ఉండవు.. కరెంట్ ఛార్జీలు తగ్గిస్తాం' ' వ్యవసాయ విద్యుత్ కనెక్షన్‌లకు స్మార్ట్ మీటర్లు బిగిస్తే నేలకేసి కొట్టండి' అంటూ ఎన్నికల సమయంలో టిడిపి నేతలు గొప్పలు చెప్పారు. అధికారంలోకి వచ్చాక అందుకు భిన్నంగా వ్యవహరిస్తున్నారు. జిల్లాలో మొత్తం 7,94,426 విద్యుత్ సర్వీసులు ఉన్నాయి. కేంద్ర ప్రభుత్వ కార్యాలయాల సర్వీసులు 415 ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాలకు 11777 సర్వీసులు ఉన్నాయి. మొత్తం 12,192 సర్వీసులకు గానవు 10,350 సర్వీసులకు ఇప్పటికే స్మార్ట్ మీటర్ల ఏర్పాటు పూర్తయింది. ఈ లెక్కన 85 శాతం పూర్తి చేసినట్లు అధికారుల గణాంకాలు చెబుతున్నాయి. ఈ నెలాఖరు నాటికి 1842 సర్వీసులకు స్మార్ట్ మీటర్లు ఏర్పాటు పూర్తి చేసి 100 శాతం లక్ష్యం చేరుకునేందుకు ప్రణాళికాబద్ధంగా విద్యుత్ సంస్థ పావులు కదుపుతోంది. మరోవైపు గృహ వినియోగదారుల సర్వీసులు 6,50,922 కాగా ఇప్పటికే 1,14,946 సర్వీసులకు స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేశారు. ఇంకా 5,35,976 సర్వీసులకు దశల వారీగా స్మార్ట్ మీటర్లు బిగించేందుకు ప్రణాళికలు సిద్ధం అవుతున్నాయి. విద్యుత్ శాఖలోని 5 విభాగాల్లో స్మార్ట్ మీటర్ల బిగింపు ప్రక్రియ కొనసాగుతోంది. ఈ ప్రక్రియ పూర్తయితే దశల వారీగా రోజుకు నాలుగైదు సార్లు రీడింగ్ తీసుకోవడం, లోడును బట్టి ఛార్జీలు వేయడం.. స్మార్ట్ మీటర్ ధర భరించాల్సి ఉండడం వంటి పరిణామాలు సర్వ సాధారణం కానున్నాయి. ఇప్పటికే వ్యాపార, వాణిజ్య సముదాయాలకు బిగించిన స్మార్ట్ మీటర్లతో ఆ వర్గాలు గగ్గోలు పెడుతున్నాయి. తాజాగా ప్రభుత్వ కార్యాలయాలు, గహ వినియోగదారుల మెడపై కత్తి వేలాడుతోంది. స్మార్ట్ మీటర్ల ప్రక్రియను అన్ని వర్గాలూ వ్యతిరేకిస్తున్నప్పటికీ కూటమి ప్రభుత్వం ఆదాయాన్ని పిండుకోవడమే లక్ష్యంగా ముందుకు సాగుతోంది.

ఈ స్మార్ట్ మీటర్ల ధరను రాష్ట్ర ప్రభుత్వం రూ.9,000గా నిర్ణయించిన విషయం విదితమే. ఇది సింగిల్ ఫేజ్ ధర కాగా త్రీ ఫేజ్ మీటరు ధర రెట్టింపు ఉంటుంది. సుమారు రూ.17000 వరకూ వసూలు చేస్తున్నారు. ఈ మొత్తాన్ని వినియోగదారులు నుంచే దశల వారీగా వసూలు చేయనున్నారు. బిల్లు చెల్లింపుల్లో నెల రోజులు ఆలస్యమైతే ఎటువంటి సమాచారం లేకుండా సరఫరా నిలిచిపోనుంది. అప్పటికప్పుడు రెండు నెలల బిల్లు ఒకేసారి చెల్లిస్తేనే తిరిగి సరఫరా పునరుద్ధరణ చేస్తారు. మొదట 33 కెవి ఫీడర్లు, 11 కెవి ఫీడర్లు, నాన్ అగ్రికల్చర్ కనెక్ట్, ప్రభుత్వ సర్వీస్‌లు, ఇండిస్టియల్, కమర్షియల్ కనెక్షన్లకు విద్యుత్ శాఖ స్మార్ట్ మీటర్లు బిగించింది. వ్యక్తిగత సర్వీసులకు రీఛార్జి అమౌంటు అయిపోతే అప్పటికపుడు చెల్లిస్తున్నారు. ప్రభుత్వ రంగ సంస్థల సర్వీసులకు చెల్లింపుల ఆలస్యం నేపథ్యంలో సరఫరా ఆగిపోతే పౌరసేవల పరిస్థితి ప్రశ్నార్థకంగా మారనుంది. కార్పొరేట్ సంస్థలకు ఆదాయాన్ని పెంచేందుకు సర్కారు స్మార్ట్ మీటర్లను బిగించి ప్రజల నడ్డివిరుస్తోందనే విమర్శలు విన్పిస్తున్నాయి.

# పడిపోయిన టమోట ధరలు.. ఆందోళనలో రైతులు



**మదనపల్లె, పతాకం న్యూస్:** మదనపల్లె టమోటా మార్కెట్‌కు ఆసియా ఖండంలోనే ఓ బ్రాండ్ ఇమేజ్ ఉంది. మదనపల్లె టమోటాలు దేశం నలమూలలే కాకుండా అంతర్జాతీయంగానూ ఎగమతులు చేసేవారు. సీజన్ అన్ సీజన్ అనే తేడా లేకుండా ప్రతినిత్యం మార్కెట్ టమోటాలు వస్తూనే ఉంటాయి. మదనపల్లె నియోజకవర్గంలోనే రైతులే కాకుండా కర్నాటక ప్రాంత రైతులు టమోటాలను పండించి మార్కెట్‌కు తీసుకొస్తారు. మార్కెట్ యార్డు ద్వారా ప్రత్యక్షంలగా పరోక్షంగా వ్యాపారులు, మండి యజమానులు, కూలీలకు, వాహన నిర్వాహకులకు ఉపాధి దొరుకుతోంది. ఎన్నో వందల కుటుంబాల మార్కెట్ ద్వారా ఉపాధి పొందుతూ జీవనం సాగించేవారు. సీజన్‌లో సుమారు 2 వేలకు పైగా మెట్రిక్ టన్నుల టమోటాలు వస్తుండగా అన్ సీజన్‌లో కనీసం వెయ్యి మెట్రిక్ టన్నులు వచ్చేవి. ఆరు నెలల కాలంగా సీన్ రివర్స్ అయింది. మదనపల్లె మార్కెట్ యార్డుకు గడ్డుకాలం వచ్చిందనే చెప్పాలి. ఆరు నెలలుగా మార్కెట్ టమోటాలు రావడం గణనీయంగా తగ్గింది. కేవలం వందల మెట్రిక్ టన్నులే వస్తున్నాయి. ధరలు క్షీణిస్తుండడంతో ఇటు రైతులు, వ్యాపారులు తలలు పట్టుకుంటున్నారు. ఇటీవల కాలంలో ఎగుమతులు పడిపోవడంతో వ్యాపారులు పంట కొనుగోలుకు మొగ్గు చూపడం లేదు. ధరలు విపరీతంగా పడిపోవడంతో రైతులు కుదేలవుతున్నారు. మదనపల్లె మార్కెట్‌కు కేవలం 150 మెట్రిక్ టన్నుల టమోటాలే రాగా మొదటి రకం టమోటా ధర పదికిలోలు రూ.110. పలకగా, రెండో రకం టమోటాలు పదికిలోలు రూ.80 పలికాయి. పంట పండించేందుకు రైతులు అధికంగా ఖర్చు చేస్తున్నా.. ధరలు నేలచూపులు చూస్తుండడంతో టమోటా రైతు తీవ్రంగా నష్టపోతున్నాడు. పాలకలు స్పందించి టమోటా రైతులను ఆదుకోవాలని పలువురు రైతులు కోరుతున్నారు. టమోట పల్పింగ్ యూనిట్, ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేయడం ద్వారా, టమోట గిడ్డంగులను నిర్మించడం ద్వారా రైతును ఆదుకోవచ్చని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. పొలాల్లోనే వదిలేస్తున్న వైనం టమోటా ధరలు పూర్తిగా పతనం కావడంతో పంటను రైతులు పొలాల్లోనే వదిలేస్తున్నారు. ఎకరాకు రూ.50 వేలకు పైగా పెట్టుబడి పెట్టి, రాత్రింబవళ్లు కష్టపడితే.. చివరకు 25 కిలోల టమోటా ట్రే కనీసం రూ.50-100 కూడా పలకని దుస్థితి నెలకొంది. ఈ ధరకు అమ్ముకుంటే కనీసం పంట కోసే కూలీలకు ఇచ్చే డబ్బులు కూడా రావని రైతులు చేసేదేమీ లేక పంటను కోయకుండా పొలాల్లోనే వదిలేస్తున్నారు. రైతు కష్టాన్ని దిగమింగుతున్న దళారులు రైతు కష్టాన్ని దళారులు మింగేస్తున్నారు. క్షేత్ర స్థాయిలో ధరల నియంత్రణ లేకపోవడం రైతులకు శాపం గా మారింది. వ్యాపారులు సిండికేట్‌గా ఏర్పడి రైతును నిలువునా ముంచుతున్నా ప్రభుత్వం, అధికారులు పట్టించుకోవడం లేదు. అటు వినియోగదారుడు అధిక ధరలకు కొంటూ, ఇటు రైతు మద్దతు ధర లేక నష్టపోతూ ఉంటే.. మధ్యలో దళారులు మాత్రం లాభపడు తున్నారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి, ప్రభుత్వమే నేరుగా టమోటా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. పెట్టుబడి కూడా రావడం లేదు ధరలు పతనం కావడంతో పంట సాగుకు పెట్టిన పెట్టుబడి కూడా రావడం లేదని, పొలాల గట్ల వెంబడి కుప్పలుగా పోసిన టమోటాలు కుళ్లిపోయి దుర్వాసన వస్తున్నాయని, . పెట్టుబడి కోసం చేసిన అప్పులు ఎలా తీర్చాలో తెలియడం లేదని, కుటుంబ పోషణ భారవుతోందని, ప్రభుత్వం తమను ఆదుకోవాలని టమోటా రైతులు కోరుతున్నారు.

## పేకాట శిబిరంపై పోలీసుల దాడి



**బాపట్ల, పతాకం న్యూస్:** పర్చూరు మండల పరిధిలోని చెన్నుబోట్ల అగ్రహారం గ్రామ శివారులోని పొలాల్లో జరుగుతున్న పేకాట శిబిరంపై పోలీసులు సోమవారం దాడి నిర్వహించారు. పేకాట ఆడుతున్న ఆరుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై పి. గోపి తెలిపారు. జిల్లా ఎస్పీ బి. ఉమామహేశ్వర్ పర్యవేక్షణలో, డీఎస్పీ జగదీష్ నాయక్ ఆధ్వర్యంలో, పర్చూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని చెన్నుబట్ల అగ్రహారం గ్రామంలో గ్యాంబ్లింగ్‌పై నిర్వహించినట్లు చెప్పారు. వారి వద్ద నుండి మొత్తం రూ. 2,580 నగదు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు . మండల పరిధిలోని గ్రామాల్లో ఎవరైనా ఆ సాంఘిక కార్యక్రమాలు, అక్రమ కార్యకలాపాలపై పాల్పడేవారిపై కఠిన చర్యలు కొనసాగుతాయని పోలీసులు హెచ్చరించారు.

## 2025లో 33 శాతం పెరిగిన లావాదేవీలు!




**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** భారత్‌లో డిజిటల్ చెల్లింపుల వ్యవస్థ సరికొత్త శిఖరాలను అధిరోహిస్తోంది. 2025 సంవత్సరంలో యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ ద్వారా జరిగిన లావాదేవీలు 33 శాతం వృద్ధి చెంది 228.5 బిలియన్లకు చేరాయి. ఈ లావాదేవీల మొత్తం విలువ రూ.299.74 ట్రిలియన్లుగా నమోదైంది. ఈ వివరాలను 'వరల్డ్‌లైన్' సోమవారం విడుదల చేసిన తన నివేదికలో వెల్లడించింది. నివేదిక ప్రకారం, వ్యాపారులకు జరిపిన చెల్లింపులు (పీ2వీ) 34 శాతం పెరిగి 143.82 బిలియన్లకు చేరాయి. మరోవైపు, యూపీఐ సగటు లావాదేవీ విలువ (యావరేజ్ టికెట్ సైజ్) 9 శాతం తగ్గి రూ.1,314కు చేరింది. ముఖ్యంగా వ్యాపారుల వద్ద జరిపే చెల్లింపుల సగటు విలువ రూ.592కు పడిపోవడం గమనార్హం. గతంలో నగదుతో జరిపిన వీధి వ్యాపారుల వద్ద కొనుగోళ్ల వంటి చిన్న చిన్న చెల్లింపులు కూడా డిజిటల్ పరిధిలోకి వస్తున్నాయని ఇది సూచిస్తోందని నివేదిక పేర్కొంది. డిజిటల్ చెల్లింపుల కోసం మౌలిక సదుపాయాలు కూడా భారీగా పెరిగాయి. 2025లో యూపీఐ క్యూఆర్ కోడ్‌ల సంఖ్య 15 శాతం పెరిగి 731.38 మిలియన్లకు చేరింది. "భారత డిజిటల్ చెల్లింపుల వ్యవస్థ పరిణితిలో కొత్త దశకు చేరుకుంటోంది," అని వరల్డ్‌లైన్ ఇండియా సీఈవో రమేష్ నరసింహన్ తెలిపారు. మరోవైపు, భారత్ బిల్‌పే ద్వారా జరిగే రికరింగ్ చెల్లింపులు గణనీయంగా పెరిగాయి. దీని లావాదేవీల సంఖ్య 40 శాతం పెరిగి 3.05 బిలియన్లకు, వాటి విలువ 93 శాతం వృద్ధితో రూ.14.84 ట్రిలియన్లకు చేరింది.

## విద్యుత్ వైర్లు తగిలిఆర్టిసి బస్సు దగ్ధం



**కడప, పతాకం న్యూస్:** కడప జిల్లా వేంపల్లె మండలంలోని వీరన్నగట్టుపల్లె సమీపంలో ముస్లిం శ్మశాన వాటిక వద్ద 11 కెవి విద్యుత్ వైర్లు తగిలి శ్రీసత్యసాయి జిల్లా కదిరి డిపోకు చెందిన ఆర్టిసి బస్సు దగ్ధమైంది. బస్సులోని 18 మంది ప్రయాణికులతో పాటు డ్రైవర్, కండక్టర్ ప్రాణాలతో బయట పడ్డారు. తృటిలో పెను ప్రమాదం తప్పడంతో ప్రయాణికులు, అధికారులు, ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. బస్సు డ్రైవర్ ఎస్.ఎం.వలి అప్రమత్తంతో ప్రయాణికులు సురక్షితంగా బయట పడ్డారు. వివరాలలోకి వెళితే...కదిరి నుండి తలుపులు మీదుగా వేంపల్లెకు వచ్చి తిరిగి వేంపల్లె నుంచి మధ్యాహ్నం 2 గంటలకు కదిరికి బస్సు బయలుదేరింది. వేంపల్లె నుండి ప్రయాణికులతో బయలుదేరిన బస్సు వీరన్నగట్టుపల్లె వద్దకు చేరుకుంది. అక్కడ బస్సుకు టిప్పర్ అడ్డు రావడంతో వేరే రోడ్డులో వెళ్లేందుకు బస్సు డ్రైవర్ ముందుకు బస్సును తీసుకెళ్లారు. అ రోడ్డులో విద్యుత్ వైర్లు కిందికి ఉన్న విషయం గమనించకుండా ముందుకు పోవడంతో విద్యుత్ వైర్లు బస్సుకు తగిలాయి. ఒక్క సారిగా బస్సులో మంటలు రావడంతో ప్రయాణికులు కేకలు వేయడంతో బస్సును ఆపి ప్రయాణికులు అందరిని అప్రమత్తం చేసి కిందికి దిగాలని డ్రైవర్ వలి, కండక్టర్ లక్ష్మి నారాయణమ్మ కోరడంతో చాకచక్యంగా ప్రయాణికులు దిగడంతో ప్రాణాలు దక్కించుకున్నారు. ఆర్టిసి బస్సుకు విద్యుత్ వైర్లు తగలగానే విద్యుత్ లైన్ ట్రిప్ అవడంతో పెను ప్రమాదం తప్పిందని విద్యుత్ అధికారులు అంటున్నారు. సమాచారం అందుకున్న ఫైర్ స్టేషన్ సిబ్బంది హుటాహుటిన వీరన్నగట్టుపల్లె వద్దకు వెళ్లి బస్సులో చెలరేగిన మంటలను ఆర్పి వేశారు. చాగలమర్రి–రాయచోటి రోడ్డు పనులు చేసే కాంట్రాక్టర్లు నిర్లక్ష్యం కారణంగానే పనులు చేపట్టడంతో ఇడుపులపాయి రూరల్ ఫిడర్‌కు చెందిన 11 కెవి హెటెన్షన్ విద్యుత్ వైర్లు బస్సుకు తగలడంతో బస్సు దగ్ధమైంది. సంఘటన స్థలాన్ని ఆర్కేవ్యాలీ సిఐ శంకర్ రెడ్డి, చక్రాయపేట ఎస్ఐ చంద్రశేఖర్, పులివెందుల విద్యుత్ ఇఇ ప్రసాద్‌రెడ్డి, ఎడిఎ నాగేంద్ర, మైదుకూరు ఎడిఎ శ్రీకాంత్, పులివెందుల ఆర్టీసీ అధికారులు చేరుకుని డ్రైవర్, కండక్టర్‌తో వివరాలు తెలుసుకున్నారు. కండక్టర్ లక్ష్మి నారాయణమ్మ, బస్సు డ్రైవర్ ఎస్ఎం.వలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ శంకర్‌రెడ్డి తెలిపారు. ప్రమాదంపై మంత్రి మండిపల్లి ఆరా ఆర్‌టిసి బస్సు దగ్ధమైన ఘటనపై మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అధికారులతో ఆరా తీశారు. అధికారులతో ఫోన్‌లో మాట్లాడి వివరాలు ఆరా తీసిన మంత్రి. డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించిన తీరుపట్ల మంత్రి అభినందనలు తెలియజేశారు. సమయోచిత నిర్ణయంతో పెద్ద ప్రమాదం తప్పిందని మంత్రి పేర్కొన్నారు.

## వడ్డీ వ్యాపారుల వేధింపులు తట్టుకోలేక దంపతుల ఆత్మహత్య



**చిత్తూరు, పతాకం న్యూస్:** వడ్డీ వ్యాపారుల వేధింపులతో భార్యా భర్తలు ఆత్మహత్య చేసుకున్న ఘటన గాలివీడు మండలంలోని శెట్టి వారిపల్లెలో చోటుచేసుకుంది. శెట్టి వారిపల్లెకు చెందిన మల్లి కార్జున(35) గాలివీడులోని ఒక ప్రైవేటు ఫైనాన్స్ కంపెనీలో పనిచేస్తున్నాడు. అతనికి భార్య రాణి(30), ఐదేళ్లు, మూడు నెలల కుమార్తెలు ఉన్నారు. కుటుంబ అవసరాల కోసం స్థానికంగా ఉన్న పలువురి వద్ద రూ.10లక్షల వరకు అప్పు తీసుకున్నారు. ఉద్యోగం ద్వారా వచ్చే డబ్బు కుటుంబ అవసరాలకు సరిపోయేది. ఈ క్రమంలో అప్పు, వడ్డీలు అంతకంతకు పెరిగి రూ.50లక్షలకు పైగా చేరాయి. రుణదాతల నుంచి ఒత్తిడి పెరిగింది. తట్టుకోలేక శుక్రవారం రాత్రి 11 గంటలకు ఇంట్లో ఇద్దరూ పురుగుల మందు తాగారు. స్థానికులు గమనించి 108లో రాయచోటి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో కడపకు తరలించారు. అక్కడి నుంచి కర్నూలు ప్రభుత్వాస్పత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా మల్లికార్జున మృతి చెందాడు. కొంత సమయానికి రాణి కూడా మృతి చెందినట్లు కుటుంబీకులు తెలిపారు. వడ్డీ వ్యాపారుల పేర్లతో సహా రాణి వీడియో విడుదల చేసింది. ఈ ఘటనతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

## వేసవిలో నీటి ఎద్దడి నివారణకు చర్యలు

**కాకినాడ, పతాకం న్యూస్:** వేసవి కాలంలో తాగు, సాగు నీటికి ఎటువంటి ఎద్దడి లేకుండా అధికారులు ప్రణాళిక ప్రకారం పని చేయాలనికలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో రెవెన్యూ, ఇరిగేషన్, వ్యవసాయం, ఆర్డబ్ల్యూఎస్, భూగర్భ జలాలు, ఎన్ఐహెచ్, పశుసంవర్ధక, ఉద్యాన, నగరపాలక సంస్థకు చెందిన జిల్లా స్థాయి అధికారులతో వేసవి కాలంలో సాగు, తాగు నీటి ఎద్దడి లేకుండా తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ప్రస్తుత తాగు, సాగు నీటి వనరుల లభ్యత, భవిష్యత్తు అవసరాలను అధికారులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. తూర్పు, గోదావరి డెల్టాలు, ఏలేశ్వరం ఆయకట్టు కింద పంటల సాగు వివరాలు, అవసరమయ్యే సాగునీరు, ప్రస్తుత నిల్వల వివరాలపై ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రోజు రోజుకీ పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయని, రానున్న వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని జిల్లాలో తాగు, సాగు నీటికి ఎక్కడా ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా పటిష్ట చర్యలు చేపట్టాలన్నారు. ఇందుకు వివిధ శాఖల అధికారులు ప్రణాళికా ప్రకారం పని చేయాలని ఆదేశించారు. జిల్లాలో ప్రస్తుతం 20 సిపిడబ్ల్యూ స్కీములు ద్వారా మంచినీటి సరఫరా జరుగుతుందన్నారు.

## ఉద్యోగాలు ఇచ్చేంతవరకు దీక్షలు కొనసాగిస్తాం



**నందికొట్కూరు, పతాకం న్యూస్:** శ్రీశైలం నీటింపు బాధితులకు ఉద్యోగ అవకాశాలు కల్పించే వరకు దీక్షలు కొనసాగిస్తామని నీటి ముంపు బాధితులు నెహ్రూ నగర్ జయన్న హెచ్చరించారు. నందికొట్కూరు పట్టణంలోని పొట్టి శ్రీరాములు సర్కిల్ లో శ్రీశైలం ప్రాజెక్టు నిర్మాణం కోసం సర్వం కోల్పోయిన బాధితుల దీక్ష 11వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఇప్పటివరకు ఉద్యోగ అవకాశాలు ఇవ్వలేదని 32 మంది దాకా ఆత్మహత్యలకు పాల్పడ్డారని తెలిపారు. 11 రోజుల నుండి నందికొట్కూరు పట్టణంలో నిరాహార దీక్షలు చేపడుతున్నప్పటికీ ప్రభుత్వం తమ వైపు చూడడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. హామీలు ఇచ్చిన నాయకులు తమ వైపు కన్నెత్తి చూడడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగ అవకాశాలు లేని కుటుంబ సభ్యుల ఆవేదనను, గోడును పట్టించుకోవాలని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కిరణ్, మురళి, నారాయణ, నాగేంద్రుడు, వెంకట రామిరెడ్డి, లింగమయ్య తదితరులు పాల్గొన్నారు

## హంద్రీనీవా కాలువలో వ్యక్తి మృతదేహం



**శ్రీసత్యసాయి జిల్లా, పతాకం న్యూస్:** శ్రీ సత్యసాయి జిల్లా లేపాక్షి మండలంలో విషాదకర ఘటన చోటుచేసుకుంది. మండల పరిధిలోని మానేంపల్లి గ్రామ శివారులో ఉన్న హంద్రీనీవా కాలువలో ఒక వ్యక్తి మృతదేహం లభ్యమవ్వడం స్థానికంగా కలకలం రేపింది. కాలువలో మృతదేహంతో పాటు ఒక ద్విచక్ర వాహనం కూడా ఉండటాన్ని గమనించిన గ్రామస్తులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరిస్తున్నారు. ప్రమాదవశాత్తు బైక్‌తో సహా కాలువలో పడిపోయారా లేక మరేదైనా కారణం ఉందా అన్న కోణంలో విచారణ జరుపుతున్నారు.

# బరువు తగ్గాలనుకుంటున్నారా?

బరువు తగ్గటమనేది అంత త్వరగా సాధ్యమయ్యేది కాదు. దీనికి కాస్త సమయం పడుతుంది. డైటింగ్, చక్కటి పోషకాహారం తీసుకోవడం, వ్యాయామ నియమాలను పాటించటం అత్యవసరం. అధిక బరువుతో డయాబెటిస్, హైబీపీ వంటి దీర్ఘకాల సమస్యల ముప్పు పెరగడంతో పాటు కొన్నిరకాల క్యాన్సర్లూ తలెత్తొచ్చని నిపుణులు చెబుతున్నారు. వయసు మీద పడుతున్నప్పుడు చురుకుదనమూ తగ్గుతుందని పేర్కొంటున్నారు. అందుకే బరువును అదుపులో ఉంచుకోవాలని సలహా ఇస్తున్నారు. అలాగని మరీ త్వరగా బరువు తగ్గటమూ మంచిది కాదంటున్నారు. దీనికీ ఒక పద్ధతి ఉందని సూచిస్తున్నారు. మరి, అదెంటో ఇప్పుడు తెలుసుకుందాం!



శరీరానికి అవసరమైన దానికంటే ఎక్కువ కేలరీలు తీసుకోవడం వల్ల అదనపు శక్తి కొవ్వుగా మారి, బరువు పెరగడానికి దారితీస్తుందని నిపుణులు చెబుతున్నారు. సమతులాహారం తినకపోవటం, నిద్రలేమి, తగినంత శ్రమ చేయకపోవటం వంటి రక రకాల అంశాలు దీనికి కారణమవు తుంటాయని అంటున్నారు. అలాగే, బరువు పెరగటంలో కొన్ని రకాల జన్యువులు, మందులూ దీనికి దోహదం చేయొచ్చని పేర్కొంటున్నారు. కాబట్టి, వీటన్నింటినీ దృష్టిలో పెట్టుకోవటం ఎంతైనా అవసరమని సూచి స్తున్నారు. ఈ క్రమంలో ఆరోగ్యకరమైన జీవనశైలితో బరువును అదుపులో పెట్టు కోవటం పెద్ద కష్టమేమీ కాదని, చిన్న చిన్న మార్పులే పెద్ద ప్రభావాన్ని చూపుతాయని వెల్లడిస్తున్నారు.

శరీర ఎత్తు, బరువుల నిష్పత్తి ఆధారంగా బరువును లెక్కిస్తారు. ఇది 18.5- 24.9లోపు ఉండటం మంచిదని, 25 నుంచి 29.6 మధ్యలో ఉంటే అధిక బరువుగా.. 30, అంతకన్నా ఎక్కువుంటే ఊబకాయంగా పరిగణిస్తారని అధ్యయనం పేర్కొంది. బరు వును లెక్కించటానికి తేలికైన, సత్వర మార్గమే అయినప్పటికీ, ఇందులో కొవ్వు మోతాదు కచ్చితంగా తెలియదంటున్నారు నిపుణులు. శరీరంలోని నీరు, కండరాలు, ఎముకల బరువులన్నీ బీఎంఐలో కలిసే ఉంటాయని చెబుతున్నారు. వాస్తవానికి, ఎక్కువ ప్రమాదం అధిక కొవ్వుతోనే అని తెలియజేస్తున్నారు. దీని మూలంగా %దీవీ×% పెరిగినట్టయితే నెమ్మదిగా, వారానికి 450 నుంచి 900 గ్రాముల వరకు తగ్గించుకునే ప్రయత్నం చేయాలని సూచిస్తున్నారు. కొందరు త్వరగా బరువు తగ్గటం మంచిదని అనుకుంటారు. కానీ, ఎంత త్వరగా తగ్గితే అంతే వేగంగా పెరిగే ప్రమాదముంటుందని వివరిస్తున్నారు. నెమ్మదిగా, క్రమంగా తగ్గే బరువు స్థిరంగా కొనసాగుతూ వస్తుందని పేర్కొంటున్నారు. బరువు తగ్గటానికి.. ఆహారం ద్వారా లభించే కేలరీలను తగ్గించుకోవటంతో పాటు కేలరీలు ఎక్కువ ఖర్చయ్యేలా శారీరక శ్రమ చేయటం తప్పనిసరంటున్నారు నిపుణులు. రోజులో శరీరం ఖర్చు చేసే కేలరీల కన్నా సుమారు 500 తక్కువ కేలరీలు తీసుకుంటే బరువు తగ్గుతారని నిపుణులు సూచిస్తున్నారు. దీంతో వారానికి సుమారు 900 గ్రాముల బరువు తగ్గే అవకాశముందని చెబుతున్నారు. కాబట్టి కేలరీలు ఎక్కువగా ఉండే పదార్థాలు, సంతృప్త కొవ్వు పదార్థాలు, వనస్పతి వంటి ట్రాన్స్‌ఫ్యాట్స్ తగ్గించుకోవాలని సలహా ఇస్తున్నారు. రోజూ రకరకాల కూరగాయలు, పండ్లు, పొట్టుతీయని ధాన్యాలు, వెన్న తీసిన పాలు, పాల పదార్థాలు.. మాంసాహారులైతే చికెన్, చేపల వంటివన్నీ సమపాళ్లలో తీసుకోవటం ముఖ్యమంటున్నారు నిపుణులు. మన ఇష్టాయిష్టాలకు అనుగుణంగా ఆయా పదార్థాలను ఎంచుకుంటే మధ్యలో కట్టు తప్పకుండా చూసుకోవచ్చని సూచిస్తున్నారు. శారీరక శ్రమను పెంచడం, ఆహారపు అలవాట్లను మార్చడం ద్వారా కేలరీలు తీసుకోవడం తగ్గించుకోవాలని అధ్యయనం పేర్కొంది. ఈ క్రమంలో కేలరీలను లెక్కిం చుకొని తినటం ఎలా సాధ్యమని చాలా మంది అనుకుంటారు. కానీ, మితంగా తినేలా చూసుకుంటే చాలావరకు కేలరీలను తగ్గించుకోవచ్చని నిపుణులు చెబుతున్నారు. చిన్న పళ్లాన్ని ఎంచుకుంటే వడ్డించుకునే పదార్థాల పరిమాణమూ తగ్గుతుందంటు న్నారు. అలాగే ఆహారాన్ని పూర్తిగా నములుతూ, ఆస్వాదిస్తూ తినటం మంచిదని, గబగబా మింగేస్తే కడుపు నిండిన విషయం మెద డుకు తెలియదని పేర్కొంటున్నారు. దీంతో మరింత ఎక్కువ తినే ప్రమాదముందని హెచ్చరిస్తున్నారు. క్రమం తప్పకుండా శారీరక శ్రమ చేయడం వల్ల బరువు, రక్తపోటు, ఒత్తిడి తగ్గుతుందని అధ్యయనం పేర్కొంది. గుండె, శ్వాస వేగాలను పెంచే వ్యాయామాలైతే మంచిదని నిపుణులు చెబుతున్నారు. వేగంగా నడవటం, ఈత కొట్టటం, డ్యాన్స్ చేయటం వంటివన్నీ బరువు తగ్గడానికి దోహదం చేస్తాయంటున్నారు. ఎంత మంచివైనా వ్యాయామాలను ఒకేసారి వేగంగా చేయ కూడదని, క్రమంగా వేగం పెంచుకుంటూ రావాలని సూచిస్తున్నారు. బద్ధకంగా కూర్చోవటానికి బదులు తేలికైన వ్యాయా మాలైనా చేయాలని, వీటితోనూ కేలరీలు ఖర్చవుతాయని పేర్కొంటున్నారు. లిఫ్టుకు బదులు మెట్లు ఎక్కటం, అప్పుడప్పుడూ లేచి కాసేపు నడవటం వంటి చిన్న మార్పులైనా మంచి ఫలితం చూపిస్తాయని సలహా ఇస్తున్నారు.

# నిరుపయోగంగా ఉన్న అతిథి గృహం

## రెండున్నరేళ్లుగా నిర్వహణను పట్టించుకోని ఐటీడీఏ



**చింతపల్లి, పతాకం న్యూస్:** ఆంధ్ర కశ్మీర్ లంబసింగికి వచ్చే పర్యాటకులకు ఆతిథ్యం ఇవ్వాల్సిన ఐటీడీఏ అతిథి గృహం ప్రస్తుతం నిరుపయోగంగా ఉంది. రెండున్నరేళ్లుగా దాని నిర్వహణను ఐటీడీఏ అధికారులు పట్టించుకోకపోవడంతో పాడుబడిన బంగ్లాలా దర్శనమిస్తోంది. పర్యాటక సీజన్‌లో లంబసింగికి వచ్చే సందర్శకులను వసతి సమస్య వేధిస్తోంది. ఐటీడీఏ అతిథి గృహాన్ని అందుబాటులోకి తెస్తే ఎంతో ఉపయోగంగా ఉంటుంది. కానీ అధికారులు ఆ దిశగా ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదు. లంబసింగి అటవీశాఖ చెక్‌పోస్టుకు ఎదురుగా ఎకరం విస్తీర్ణంలో సుమారు 20 ఏళ్ల క్రితం ఐటీడీఏ భవనం ఉండేది. అప్పట్లో ఈ భవనాన్ని ఏపీఎస్పీ బెటాలియన్ జవాన్లు అవుట్ పోస్టుగా ఉపయోగించారు. ఏపీఎస్పీ అవుట్ పోస్టును ఎత్తివేయడంతో ఐదేళ్లపాటు ఈ భవనాన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంగా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు వినియోగించారు. పీహెచ్‌సీకి నూతన భవనం అందుబాటులోకి రావడం వల్ల ఈ భవనాన్ని దుకాణ సముదాయంగా ప్రైవేటు వ్యక్తులకు ఐటీడీఏ లీజుకు ఇచ్చింది. ఈ భవనం మరమ్మతులకు గురికావడంతో నిరుపయోగంగా ఉండేది. గత ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి రోణంకి గోపాలకృష్ణ ఈ భవనాన్ని రూ.30 లక్షలతో అతిథి గృహంగా ఆధునికీకరించారు. అత్యాధునిక సదుపాయాలతో ఆరు గదులు అందుబాటులోకి తీసుకొచ్చారు. అతిథి గృహం ప్రాంగణంలోనే రెస్టారెంట్‌ను నిర్మించారు. ఈ అతిథి గృహాన్ని 2023 డిసెంబరు 28న అప్పటి గిరిజన సంక్షేమశాఖ కార్యదర్శి కాంతిలాల్ దండే ప్రారంభించారు. ఈ అతిథి గృహం నిర్వహణ బాధ్యతను స్థానిక గిరిజన యువతకు అధికారులు అప్పగించారు. ఏడాదికి రూ.5 లక్షలు ఐటీడీఏకి చెల్లించాలనే నిబంధన పెట్టారు. ఆరు నెలల పాటు దీనిని నిర్వహించిన గిరిజన యువత ఏడాదికి రూ.5 లక్షలు చెల్లించడం సాధ్యంకాదని గుర్తించి బాధ్యతల నుంచి తప్పుకున్నారు. అప్పటి నుంచి ఐటీడీఏ అధికారులు ఇతర వ్యక్తులకు దీనిని లీజుకు ఇవ్వలేదు. ఈ ఏడాది అతిథి గృహం నిర్వహణకు అధికారులు దరఖాస్తులు ఆహ్వానించినప్పటికీ ఎవరూ ముందుకురాలేదు. అతిథి గృహాన్ని అందుబాటులోకి తీసుకొచ్చేందుకు ఐటీడీఏ అధికారులు ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోలేదు.

రెండున్నరేళ్లుగా నిరుపయోగంగా ఉండడంతో అతిథి గృహం ప్రాంగణమంతా పిచ్చిమొక్కలతో పాడుబడిన భవనం మాదిరిగా తయారైంది. లంబసింగికి సీజన్‌లో అత్యధిక సంఖ్యలో పర్యాటకులు వస్తారు. వేసవిలోనూ ఓ మాదిరిగా పర్యాటకులు వస్తుంటారు. ఐటీడీఏ అతిథి గృహం లంబసింగి ముఖద్వారంలో ఉండడంతో ఇక్కడ బస చేసేందుకు పర్యాటకులు ఆసక్తి చూపుతున్నారు. హరిత రిసార్ట్స్‌లో వేసవిలోనూ పర్యాటకులు బస చేస్తున్నారు. ఐటీడీఏ అతిథి గృహాన్ని వినియోగంలోకి తీసుకొస్తే పర్యాటకులకు సౌకర్యవంతంగా ఉంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

## అణు విద్యుత్ క్షేత్రాలపై దాడులతో తీవ్ర పరిణామాలు: ఇరాన్



**ఇరాన్:** అణు ఆధారిత విద్యుత్ క్షేత్రాలపై దాడుల వల్ల తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సివస్తుందని ఇరాన్ ఆందోళన వ్యక్తం చేసింది. రేడియో ధార్మిక పదార్థాలు భూ, జలాలు, వాతావరణంలోకి విడుదలయితే ఇరాన్‌తో పాటు ఇరాన్ ఆవల కూడా మానవ, పర్యావరణ విపత్తులకు దారితీయవచ్చునని పేర్కొంది. అందువల్ల అమెరికా, ఇజ్రాయిల్ తమ దేశంలోని అణు విద్యుత్ స్థావరాలను లక్ష్యం చేసుకొని చేస్తున్న దాడులను తీవ్రంగా ఖండించాల్సిందిగా ఐక్యరాజ్యసమితి ప్రధానకార్యదర్శి ఆంటోనియా గుటెర్రెస్‌కు ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ ఒక లేఖ రాశారు. ఈ లేఖను ఆయన సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేశారు. ఇరాన్‌లో పనిచేస్తున్న ఏకైక అణు విద్యుత్ ప్లాంటుపై పదే పదే జరుగుతున్న దాడులు పశ్చిమాసియాలో మానవ, పర్యావరణ ప్రమాదాలకు దారితీస్తాయని అరాగ్చీ హెచ్చరించారు. బుషెహర్ స్థావరంపై జరుగుతున్న దాడులను సహించలేని పరిస్థితి నెలకొన్నదని చెప్పారు.రేడియో ధార్మిక పదార్థాలు కలుషితమైతే ఇరాన్ సరిహద్దులకు ఆవల కూడా తీవ్ర పరిణామాలు తప్పవని ఆందోళన వ్యక్తం చేశారు. బుషెహర్ ప్లాంటుపై నాలుగు సార్లు దాడి జరిగిందని సామాజిక మాధ్యమ వేదిక ఎక్స్ ద్వారా ఆయన తెలియజేశారు. రేడియో ధార్మిక పదార్థాలు విడుదలైన పక్షంలో టెహ్రాన్ కంటే గల్ఫ్ సహకార మండలి సభ్య దేశాలకే ముప్పు ఎక్కువ అని చెప్పారు. ఇరాన్ యుద్ధం కారణంగా పెరుగుతున్న చమురు ధరలతో లాభాలు దండుకుంటున్న ఇంధన కంపెనీలపై పన్నులు విధించాలని ఐదు యూరోపియన్ దేశాల ఆర్థిక మంత్రులు సూచించారు. ఈ మేరకు జర్మనీ, ఇటలీ, స్పెయిన్, పోర్చుగల్, ఆస్ట్రియా దేశాల ఆర్థిక మంత్రులు ఈయూ కమిషన్‌కు ఓ లేఖ రాశారు. 'మనమంతా సంఘటితంగానే ఉన్నామని, చర్య తీసుకునేందుకు సిద్ధమేనని సంకేతం పంపడానికి ఇలాంటివి అవసరం' అని వారు అభిప్రాయపడ్డారు. చమురు కంపెనీలపై భారీగా పన్నులు విధించడం ద్వారా సామాన్య ప్రజలపై భారం తగ్గుతుందని వారు తెలిపారు. దక్షిణ లెబనాన్‌లో ఐరాస శాంతి పరిరక్షక కేంద్ర కార్యాలయానికి చెందిన 17 నిఘా కెమేరాలను ఇజ్రాయిల్ ధ్వంసం చేసింది. కోస్తా ప్రాంతంలోని నఖురా పట్టణంలో ఏర్పాటు చేసిన ఈ కెమేరాలను ఇజ్రాయిల్ దళాలు ధ్వంసం చేశాయని లెబనాన్‌లో ఐరాస తాత్కాలిక దళాల (యునిఫిల్) ప్రతినిధి కండిస్ అర్డియల్ తెలిపారు. పట్టణంలో తిష్ట వేసిన ఇజ్రాయిల్ సేనలు అక్కడి భవనాలను పెద్ద సంఖ్యలో నేలమట్టం చేశారని ఆమె అన్నారు.




## అందుకే ఐపీఎల్‌కు రిటైర్‌మెంట్ ప్రకటించా.. అశ్విన్ సంచలన వ్యాఖ్యలు




ఐపీఎల్ 2026లో చెన్నై సూపర్ కింగ్స్ జట్టు పేలవ ప్రదర్శన కనబరుస్తున్న సంగతి తెలిసిందే. ఆడిన మూడు మ్యాచుల్లోనూ ఓటమి చవి చూసి తీవ్ర విమర్శల పాలైంది. ఈ నేపథ్యంలో తన ఐపీఎల్ రిటైర్‌మెంట్‌పై టీమిండియా దిగ్గజం, సీఎస్కే మాజీ ప్లేయర్ రవిచంద్రన్ అశ్విన్ చేసిన వ్యాఖ్యలు సంచలనంగా మారాయి. గతేడాది అశ్విన్ అనూహ్యంగా ఐపీఎల్‌కు వీడ్కోలు పలికిన విషయం తెలిసిందే. ఆ నిర్ణయం వెనుక ఉన్న అసలు కారణాలను, తన మనసులోని ఆవేదనను తాజాగా అశ్విన్ పంచుకున్నాడు. 'ఐపీఎల్ 2025.. నా కెరీర్‌లో అత్యంత నిరాశాజనకమైన సీజన్ అది. నిజం చెప్పాలంటే నేను ఇంకా ఆడగలిగే స్థితిలోనే ఉన్నాను. కానీ మానసికంగా పూర్తిగా అలసిపోయాను. అలాంటి పరిస్థితుల్లో కొనసాగడం చాలా కష్టం అనిపించింది. గత ఐపీఎల్ సీజన్ గురించి ఆలోచిస్తేనే చాలా బాధగా ఉంటుంది. అందుకే అక్కడ జరిగిన విషయాల గురించి నేను మాట్లాడాలనుకోవడం లేదు. నా రిటైర్‌మెంట్ నిర్ణయం పూర్తిగా నా వ్యక్తిగతం అయితే కాదు. ఇందులో జట్టు ప్రయోజనాలు కూడా ఉన్నాయి. నేను జట్టులో కొనసాగితే నన్ను రిటైన్ చేయాలా? రిలీజ్ చేయాలా? అన్న సందిగ్ధం మేనేజ్‌మెంట్‌కు ఉంటుంది. నేను తప్పుకుంటే వారికి ఆ సమస్య ఉండదు. అందులోనూ ఫ్రాంచైజీకి సుమారు రూ.10కోట్లు సేవ్ అవుతాయి' అని అశ్విన్ వెల్లడించాడు. ప్రస్తుతం సీఎస్కే యువ ఆటగాళ్లతోనే ఆడుతోంది. ఈ విషయంపై కూడా అశ్విన్ మాట్లాడాడు. 'యువ ప్లేయర్లకు సరైన శిక్షణ, ప్రాక్టీస్, పోటీ వాతావరణం కల్పించకుండా మంచి ఫలితాలు ఆశించడం పద్ధతి కాదు. బౌలర్లను వారి బలాలకు విరుద్ధంగా ఉపయోగిస్తే జట్టుకే నష్టం. జెమీ ఓవర్టన్ వంటి బౌలర్లకు అలవాటే లేని యార్కర్లు వేయమని ఒత్తిడి చేయడం సరైన వ్యూహం కాదు. వారికున్న బలాలను కనుగొని.. తగ్గట్టుగా శిక్షణ ఇస్తే జట్టుకు విజయాలు దక్కే అవకాశాలు ఉంటాయి' అని అశ్విన్ వివరించాడు.

## రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు గెలుపు



మాజీ చాంపియన్ చెన్నై సూపర్ కింగ్స్ వేదికలు మారినా.. తమ ఆటతీరు ఇంతే అన్నట్టుగా సాగుతోంది. పేలవ బౌలింగ్‌తో నిరాశపరుస్తూ హ్యాట్రిక్ ఓటములతో పట్టికలో అట్టడుగున నిలిచింది. అటు డిఫెండింగ్ చాంపియన్ రాయల్స్ చాలెంజర్స్ బెంగళూరు మాత్రం తమ జోరును కొనసాగిస్తోంది. ఆదివారం జరిగిన ఈ మ్యాచ్‌లో బ్యాటింగ్‌లో బెంబేలెత్తించిన రజత్ సేన 43 పరుగుల తేడాతో ఘనవిజయం సాధించింది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన బెంగళూరు 20 ఓవర్లలో 3 వికెట్లకు 250 పరుగులు చేసింది. డేవిడ్ (25 బంతుల్లో 3 ఫోర్లు, 8 సిక్సర్లతో 70 నాటౌట్), దేవ్‌దత్ పడిక్కళ్ (29 బంతుల్లో 5 ఫోర్లు, 2 సిక్సర్లతో 50), రజత్ (19 బంతుల్లో 1 ఫోర్, 6 సిక్సర్లతో 48 నాటౌట్), సాల్ట్ (30 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్సర్లతో 46) అదరగొట్టారు. ఆ తర్వాత ఛేదనలో చెన్నై 19.4 ఓవర్లలో 207 పరుగులకు ఆలౌటైంది. సర్ఫరాజ్ (25 బంతుల్లో 8 ఫోర్లు, 2 సిక్సర్లతో 50), ప్రశాంత్ (29 బంతుల్లో 6 ఫోర్లు, 1 సిక్స్‌తో 43), ఒవర్టన్ (16 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్సర్లతో 37) మాత్రమే రాణించారు. భువనేశ్వర్‌కు మూడు.. క్రునాల్, అభినందన్, డఫీలకు రెండేసి వికెట్లు దక్కాయి. టిమ్ డేవిడ్ 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా నిలిచాడు.

సీఎస్‌కే భారీ ఛేదనలో సర్ఫరాజ్ ఇన్నింగ్స్ మాత్రమే హైలైట్‌గా నిలిచింది. సీనియర్ ఓపెనర్లు శాంసన్ (9), రుతురాజ్ (7)లతో పాటు ఆయుష్ (1) తొలి మూడు ఓవర్లలోనే వెనుదిరిగారు. ఈ స్థితిలో సర్ఫరాజ్ ఎడాపెడా షాట్లతో ఆకట్టుకున్నాడు. అతడి జోరుకు పవర్‌ప్లేలో జట్టు 77/4 స్కోరుతో నిలిచింది. అలాగే తను 24 బంతుల్లోనే హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. కానీ అదే స్కోరుపై వెనుదిరగడంతో జట్టు జోరుకు బ్రేక్ పడింది. దూబె (18) కూడా విఫలం కాగా, యువ బ్యాటర్ ప్రశాంత్ మాత్రం ఆర్‌సీబీ బౌలర్లను దీటుగా ఎదుర్కొన్నాడు. ఒవర్టన్ కూడా వేగం కనబర్చడంతో ఏడో వికెట్‌కు 57 రన్స్ చేరాయి. స్వల్ప వ్యవధిలోనే వీరు వెనుదిరగడంతో చెన్నైకి దారులన్నీ మూసుకుపోయాయి. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన బెంగళూరు ఇన్నింగ్స్ నెమ్మదిగా సాగి క్రమేపీ రాకెట్ వేగాన్ని అందుకుంది. డెత్ ఓవర్లలో టీమ్ డేవిడ్, రజత్ పటీదార్ విధ్వంసం కారణంగా ఐదు ఓవర్లలోనే 97 పరుగులు సమకూరడం విశేషం. తొలి మూడు ఓవర్లు చెన్నై బౌలర్లు నియంత్రించినా ఆ తర్వాత చేసేదేమీ లేకపోయింది. తొలి వికెట్‌కు 37 పరుగులు జత చేశాక ఓపెనర్ విరాట్ ఐదో ఓవర్‌లో వెనుదిరిగాడు. ఆ తర్వాత సాల్ట్‌తో జత కలిసిన దేవ్‌దత్ స్కోరులో వేగం పెంచాడు. ముఖ్యంగా పవర్‌ప్లే ముగిశాక బౌలర్లపై ఎదురుదాడికి దిగారు. దీంతో రెండో వికెట్‌కు 37 బంతుల్లోనే 56 పరుగుల భాగస్వామ్యం ఏర్పడింది. 13వ ఓవర్‌లో రజత్ 6, దేవ్‌దత్ 6,4,4తో 23 పరుగులు లభించాయి. 28 బంతుల్లో ఫిఫ్టీ పూర్తి చేశాక దేవ్‌దత్ వెనుదిరిగాడు. కానీ ఆ తర్వాత రజత్, డేవిడ్ బాదుడుకు స్కోరు దూసుకెళ్లింది. ఖలీల్ ఓవర్‌లో 6,4,6తో రజత్ 19 రన్స్ రాబట్టగా, ఇక 19వ ఓవర్‌లో 6,2,4,6,6,6తో డేవిడ్ 30 రన్స్ రాబట్టడంతో 21 బంతుల్లోనే ఫిఫ్టీ కూడా పూర్తయ్యింది.

బెంగళూరు: సాల్ట్ (సి) నూర్ (బి) దూబె 46, విరాట్ (సి) దూబె (బి) అన్షుల్ 28, దేవ్‌దత్ (బి) ఒవర్టన్ 50, రజత్ పటీదార్ (నాటౌట్) 48, టిమ్ డేవిడ్ (నాటౌట్) 70, ఎక్స్‌ట్రాలు: 8; మొత్తం: 20 ఓవర్లలో 250/3; వికెట్ల పతనం: 1-37, 2-93, 3-151; బౌలింగ్: ఖలీల్ 4-0-37-0, హెన్రీ 3-0-36-0, అన్షుల్ 4-0-52-1, నూర్ 4-0-49-0, ఒవర్టన్ 3-0-42-1, దూబె 2-0-30-1.




# 10న 'లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ'



'లవ్ టుడే' చిత్రంతో యువతలో విపరీతమైన క్రేజ్ సంపాదించుకున్న ప్రదీప్ రంగనాథన్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ' . విఘ్నేష్ శివన్ దర్శకత్వం వహించిన ఈ సినిమా తెలుగు ట్రైలర్‌ను స్టార్ డైరెక్టర్ అనిల్ రావిపూడి తాజాగా విడుదల చేశారు. ప్రేమకు కూడా ఇన్సూరెన్స్ ఉంటే ఎలా ఉంటుందనే వినూత్నమైన కథాంశంతో ఈ సినిమా తెరకెక్కింది. 2040 నాటి భవిష్యత్ ప్రపంచంలో ఈ కథ నడుస్తుంది. ఎవరు ఎవరితో కలిస్తే బాగుంటుందో తేల్చేందుకు ఎస్.జె. సూర్య 'హాxఖ' అనే ఒక యాప్‌ను సృష్టిస్తారు. ఈ యాప్ కారణంగా ప్రేమలో విఫలమైన ఓ యువకుడి (ప్రదీప్ రంగనాథన్) కథే ఈ సినిమా. సోషల్ మీడియా పిచ్చితో ఉండే 'ధీమా' పాత్రలో కృతి శెట్టి, ఆమెను ప్రేమించే 'వైబ్ వాసు'గా ప్రదీప్ కనిపించారు.

ట్రైలర్‌లో ప్రదీప్ రంగనాథన్ తనదైన ఎనర్జిటిక్ నటనతో ఆకట్టుకున్నాడు. "ఇప్పుడు ఒక యాప్ ఒప్పుకోలేదని బ్రేకప్ చెప్తున్నారా?" అంటూ అతను చెప్పే డైలాగ్ నేటి తరం ప్రేమ సంబంధాలపై సెటైర్‌గా ఉంది. "ఒక హార్ట్ చేయగలిగేది ఏ యాప్ చేయలేదని ప్రూవ్ చేస్తా" అనే డైలాగ్‌తో సినిమా ఉద్దేశాన్ని తెలియజేశాడు. ప్రదీప్, కృతి శెట్టిల మధ్య కెమిస్ట్రీ కొత్తగా ఆకట్టుకుంది. దర్శకుడు విఘ్నేష్ శివన్ ఎంచుకున్న ఫ్యూచరిస్టిక్ కాన్సెప్ట్, ఎస్.జె. సూర్య నటన సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలవనున్నట్లు తెలుస్తోంది. అనిరుధ్ రవిచందర్ అందించిన నేపథ్య సంగీతం, రవి వర్మన్ కెమెరా పనితనం ట్రైలర్‌కు హైలైట్‌గా నిలిచాయి. నయనతార, ఎస్ఎస్ లలిత్ కుమార్ సంయుక్తంగా నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 10న తెలుగు, తమిళ భాషల్లో ఏకకాలంలో విడుదల కానుంది. ప్రస్తుతం ఈ ట్రైలర్ సినిమాపై అంచనాలను పెంచుతోంది.

# 'రాకాస'కు రెండు రోజుల్లో రూ.10 కోట్లు దాటిన గ్రాస్



యంగ్ హీరో సంగీత్ శోభన్, నయన్ సారిక జంటగా నటించిన హారర్ కామెడీ చిత్రం 'రాకాస' బాక్సాఫీస్ వద్ద మంచి వసూళ్లను రాబడుతోంది. విడుదలైన తొలి రెండు రోజుల్లోనే ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా రూ. 10.30 కోట్ల గ్రాస్ సాధించినట్లు చిత్ర నిర్మాణ సంస్థ అధికారికంగా ప్రకటించింది.

ఈ నెల 3న థియేటర్లలోకి వచ్చిన ఈ చిత్రానికి తొలి రోజు నుంచే పాజిటివ్ టాక్ లభించింది. దీంతో మొదటి రోజు ప్రపంచవ్యాప్తంగా రూ. 5.6 కోట్ల గ్రాస్ వసూలు చేసినట్లు చిత్ర యూనిట్ పోస్టర్ ద్వారా వెల్లడించింది. వీకెండ్ కూడా కలిసి రావడంతో రెండో రోజు కూడా అదే జోరును కొనసాగించింది.సినిమాకు వస్తున్న స్పందన పట్ల చిత్ర బృందం ఆనందం వ్యక్తం చేస్తూ 'బ్లాక్‌బస్టర్ సక్సెస్ మీట్' నిర్వహించింది. ఈ సందర్భంగా నిర్మాత నిహారిక కొణిదెల మాట్లాడుతూ.. "ప్రీమియర్ల నుంచే మా సినిమాకి మంచి రెస్పాన్స్ దక్కింది. ఎంటర్టైన్మెంట్ ఇవ్వాలనే ఉద్దేశంతో తీసిన మా 'రాకాస'ని చూసి ఆడియెన్స్ ఎంజాయ్ చేస్తున్నారు" అని తెలిపారు. మెగా డాటర్ నిహారిక తన పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ బ్యానర్‌పై జీ స్టూడియోస్‌తో కలిసి ఈ చిత్రాన్ని నిర్మించారు. ఈ సినిమాతో మానస శర్మ దర్శకురాలిగా పరిచయమయ్యారు. హారర్ కామెడీ నేపథ్యంలో తెరకెక్కిన ఈ చిత్రంలో వెన్నెల కిషోర్, గెటప్ శ్రీను, బ్రహ్మాజీ కీలక పాత్రలు పోషించారు.

# 'బైకర్'పై సినిమాపై రామ్ చరణ్ ప్రశంసలు



గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ 'బైకర్' చిత్రంపై ప్రశంసల వర్షం కురిపించారు. సినిమా మంచి విజయం సాధించడం పట్ల సంతోషం వ్యక్తం చేస్తూ చిత్ర బృందానికి సోషల్ మీడియా వేదికగా అభినందనలు తెలిపారు. విభిన్నమైన కథాంశంతో వస్తున్న ఈ సినిమా గురించి అద్భుతమైన విషయాలు వింటున్నానని ఆయన పేర్కొన్నారు.

"బైకర్' సినిమా గురించి చాలా అద్భుతమైన విషయాలు వింటున్నాను. ఈ చిత్రం ఇంతటి విజయం సాధించడం చూస్తుంటే నాకు చాలా సంతోషంగా ఉంది.

ఒక విభిన్నమైన కథను ఎంతో నమ్మకంతో స్వీకరించి, ఎక్కడా రాజీ పడకుండా భారీ స్థాయిలో నిర్మించినందుకు యూవీ క్రియేషన్స్‌కు హ్యాట్సాఫ్ చెప్పాలి. ఇది నిజంగా ప్రశంసించదగ్గ విషయం. నా ప్రియ మిత్రుడు శర్వానంద్ నటనకు ప్రేక్షకుల నుంచి ఇంతటి ప్రేమ లభిస్తున్నందుకు నాకు చాలా ఆనందంగా ఉంది. అలాగే, రాజశేఖర్ గారి పాత్రకు కూడా అద్భుతమైన స్పందన వస్తోందని వినడం సంతోషాన్నిచ్చింది.

ఇలాంటి ఒక ప్రత్యేకమైన ప్రయత్నం చేసిన దర్శకుడు అభిలాష్ కంకరను ప్రత్యేకంగా మెచ్చుకోవాలి. ఈ గొప్ప విజయం సందర్భంగా నిర్మాతలు వంశీ, ప్రమోద్, విక్రమ్‌లతో పాటు మొత్తం చిత్ర బృందానికి నా హృదయ పూర్వక అభినందనలు. వీలైనంత త్వరగా ఈ సినిమాను చూడాలని ఎదురు చూస్తున్నాను" అంటూ రామ్ చరణ్ తన ట్వీట్ లో పేర్కొన్నారు.




Edited, Printed, Published & Owned by **LEKKALA SREENU** and Published from D.NO: 4-14/5-201, Revenue Ward NO. 57, Aganampudi, Near Toll Gate, Duvvada, Talarivanipalem,VISAKHAPATNAM, AP-530049 and Printed at **Guddapuvalasa Ramani**, D.No. 18-135/1/1, Opp. Apollo Hospital, Pedagadhili, VISAKHAPATNAM, A.P.-530040. E-mail: Pathakamnews.ap@gmail.com, **Mobile No: 7097975757, Reg No. APTEL/25/A2082**